ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
మంగళవారం 17 డిసెంబరు 2024

అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్



ప్రజా సమస్యలను బాధ్యతాయుతంగా పరిష్కరించాలి

● కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన సమస్యలను బాధ్యతాయుతంగా సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమా వేశం హాలులో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు డీఆర్వో మధుసూదన్ రావు, కలెక్టరేట్ ఎస్డీసీ రామసుబ్బయ్యలు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి అందిన సమస్యలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవాలను పరిశీలించి సమ స్యలను పరిష్కరించాలన్నారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ పరిధిలోకి వెళ్లకుండా నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తులు రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా చూడాలని సూచించారు. ప్రభుత్వ శాఖలలో కోర్టు కేసులకు సంబంధించి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కనీసం 15 రోజుల ముందుగానే కౌంటర్‌ను సిద్ధం చేయాలని, నిర్ణీత కాల వ్యవధిలో కౌంటర్ ఫైల్ చేయని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని జిల్లా, మండల స్థాయి అధికారులను కలెక్టర్ హెచ్చరించారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం చేయవద్దని.. తక్షణం స్పందించి పరిష్కారం చూపాలని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన రాయచోటి పట్ట ణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్య క్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యా దుదారుల నుంచి అర్జీలను స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులకు వేధింపులు, భూ-ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ప్రేమ పేరుతో మోసం తదితర సమస్యలపై ఫిర్యాదుదారులు విన్నవించుకోగా.. సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ స్వయంగా ఫోన్‌లో మాట్లాడారు. బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకుని నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. ఈ సందర్భంగా బాధితులు ఎస్పీకి ఫిర్యాదు చేసిన వాటిలో కొన్నింటిని పరిశీలిస్తే.. తన భార్య మస్కట్ దేశానికి వెళ్లిందని, అక్కడ ఆమెను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చిందని, తన భార్యను ఇండియాకు రప్పించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఓ బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఇంట్లో నుంచి తన కుమారులు బయటకు పంపారని.. న్యాయం చేయాలని ఓ వృద్ధురాలు వేడుకుంది. ఇంటి స్థలం ఇప్పిస్తానని తన వద్ద డబ్బులు తీసుకొని ఓ వ్యక్తి మోసం చేశాడని బాధితుడు ఎస్పీ ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు. పైఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ తక్షణమే ఆయా పోలీసు స్టేషన్ల అధికారులతో మాట్లాడి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అలాగే తన సమస్యను విన్నవించడానికి జిల్లా పోలీసు కార్యాలయానికి వీల్ చైర్‌లో వచ్చిన మదనపల్లె పట్టణానికి చెందిన ఆవుల రామచంద్ర వద్దకే ఎస్పీ స్వయంగా వెళ్లి.. సమస్యను సావధానంగా విని సత్వరం విచారించి న్యాయం చేయాల్సిందిగా మదనపల్లి డీఎస్పీని ఆదేశించారు.

విచారణకు హాజరైన వెంకటరామిరెడ్డి

● కలెక్టర్ శ్రీధర్‌కు వివరణ ఇచ్చిన ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు

● ఇది కేసీ కాదు.. ప్రశ్నిస్తానని కేసులు, విచారణలు..



కలెక్టర్ ఎదుట విచారణకు హాజరైన ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి

కడప కలెక్టరేట్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి కలెక్టర్ ఎదుట విచారణకు హాజరయ్యారు. ఎన్నికల సమయంలో జిల్లాలో ప్రచారంలో పాల్గొన్నారనే ఫిర్యాదులపై సోమవారం కలెక్టర్ ఎదుట హాజరై వివరణ ఇవ్వాలని ఆయనకు ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆయన కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు వివరణ ఇచ్చుకున్నారు అనంతరం కార్యాలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో కడప జిల్లాలో నాలుగు ఆర్టీసీ డిపోల వద్ద ప్రచారం చేస్తున్నానంటూ ఫిర్యాదులు వెళ్లడంతో తనను సస్పెండ్ చేశారన్నారు. అందులో భాగంగా కడప జిల్లా కలెక్టర్‌ను విచారణాధికారిగా ప్రభుత్వం నియమించిందన్నారు. ఇందులో భాగంగా కలెక్టర్ అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పానన్నారు. ఎన్నికల సమయంలో తాను ఎలాంటి ప్రచారం చేయలేదని, కొన్ని పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా తనతో పాటు కొందరు ఆర్టీసీ ఉద్యో గులను సస్పెండ్ చేశారని అన్నారు. తమపై కోర్టులో కేసులు కూడా వేశార న్నారు. కలెక్టర్‌కు అన్ని విషయాలు వివరించానని ఆయన పాజిటివ్‌గా స్పందించారన్నారు. ఎన్నికల సమయంలో ఇంకో అసోసియేషన్ నాయకుడు అప్పటి పాలక ప్రభుత్వాన్ని విమర్శించారని ఆయనకు ఒక్క నోటీసుకూడా ఇవ్వలేదన్నారు. కానీ తనమీద అయితే కేసులు, ఎంక్వరీ ఆఫీసర్లు వేశార న్నారు. తాము ఉద్యోగుల పక్షాన పోరాడతామన్నారు. ముందు జాయింట్ స్టాఫ్ మీటింగ్ పెట్టాలని డిమాండ్ చేశారు. సచివాలయాల ఉద్యోగులకు రాజకీయ ఒత్తిళ్లు ఎక్కువయ్యాయని, వారిని వలంటీర్ల కంటే తక్కువగా చూస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వచ్చి 6నెలలు దాటినా ఇంతవ రకు ఉద్యోగుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగులను గూర్చి పట్టించుకోవాలని అన్నారు. తనను మళ్లీ రెండుమూడు సార్లు విచారణకు రావాలని కలెక్టర్ కోరారన్నారు. కలెక్టర్ మీద నమ్మకం ఉందని, న్యాయబద్ధంగానే రిపోర్టు ఇస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ ఇసుక డంపులు ఎవరివి..?

● చెరువు చుట్టూ ఇసుక డంపులే

● యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

6



రామానాయుని చెరువు సమీపంలోని పొలాల్లో డంపు చేసిన ఇసుక




డొక్కు బస్సులు.. చెత్త ప్రయాణం



ఆర్టీసీ అంటే... రాదు.. తెలియదు.. చెప్పలేం.. అనే నానుడి ఉంది. ఇది రాయచోటి డిపోలోని బస్సులను చూస్తే.. అక్షరాల నిజం అనిపిస్తుంది. ఈ డిపోలోని కాలం చెల్లిన డొక్కు బస్సులు ఎక్కడ పడితే అక్కడ ఆగిపోతూ ప్రయాణికులకు నరకం చూపిస్తున్నాయి. డ్రైవర్లకు తిప్పలు తప్పడం లేదు. అయితే అమ్యామ్యాలకు అలవాటుపడిన కొంత మంది ఆర్టీసీ అధికారులు మాత్రం అద్దె బస్సులపై మోజు పెంచు కుంటూ ఆర్టీసీ బస్సులకు బూజు పట్టిస్తున్నారు. కాలం చెల్లిన (కిలోమీటర్లు పూర్తయిన) బస్సులను పల్లె మార్గాల్లో నడిపిస్తున్నారు. ఇవి ఉన్నట్టుండి మరమ్మతులకు గురై ఆగిపోతున్నాయి. విసిగిపోయిన ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. వెరశి రాయచోటి ఆర్టీసీ డిపో రూ.కోట్లలో నష్టాలను మూటగట్టుకుంటోంది.

● అధ్వానపు రోడ్లతో అవస్థలు
● పల్లె బస్సులు నడవక
గ్రామీణ ప్రజల ఇక్కట్లు
● ప్రయాణికులతో పని లేకుండా..
నడుస్తున్న అద్దె బస్సులు
● ప్రతి నెల రూ.కోటి నష్టం
● నష్టాల బాటలో రాయచోటి ఆర్టీసీ డిపో



ఆర్టీసీ బస్టాండులో ఆగి ఉన్న అద్దె బస్సు

రాయచోటి టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాయచోటి ఆర్టీసీ డిపో పరిధిలో 90 ఆర్టీసీ బస్సులు. 44 అద్దె బస్సులు తిరుగుతున్నప్పటికీ ప్రయాణికులకు మాత్రం తిప్పలు తప్పడం లేదు. అధ్వానంగా ఉన్న రోడ్ల వెంట కాలం చెల్లిన ఆర్టీసీ బస్సులు తిరుగుతుండటంతో ఎక్కడ పడితే అక్కడ ఆగిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు ఆర్టీసీలో ప్రయాణించాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రైవేటు బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ముఖ్యంగా వేంపల్లి రోడ్డులో 8 బస్సులు తిరుగుతున్నప్పటికీ గంటల తరబడి ప్రయా ణికులు బస్సు కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. బస్సులు ఒక్కసారిగా ఒకదాని వెనక ఒకటి.. కేవలం పది నిమిషాల తేడాతో మూడు, నాలుగు బస్సులు వస్తుండడం వలన ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షణ చేయాల్సి వస్తోంది. అలాగే కదిరి మార్గంలో 14 బస్సులు తిరుగుతుండగా అన్ని అద్దె బస్సులు కావడం గమనార్హం. తిరుపతి మార్గంలో తిరిగే అద్దె బస్సులు మరీ దారుణంగా తిరుగుతున్నాయని ప్రయా ణికులు ఆరోపిస్తున్నారు. రాయచోటి నుంచి తిరుపతికి వెళ్లే సమయంలో 15 నుండి 20 మంది ప్రయాణికులతో వెళ్లే అద్దె బస్సులు.. తిరుపతి నుంచి రాయచోటికి వచ్చే సమయంలో కేవలం పది మంది లోపు మాత్రమే తీసుకువస్తుండడంతో ఆర్టీసీని నష్టాల ఊబిలోకి నెట్టుతున్నాయి. అందులోనూ అద్దె బస్సులకు కండక్టర్ లేకపోవడంతో డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఎక్కడైనా ప్రయాణికులు చేయి ఎత్తినా ఆపకుండా రాయచోటి వరకు వస్తున్నారంటే కేవలం వారు కిలోమీటర్ల ప్రామాణికంగా బస్సులను నడుపుతూ ప్రభుత్వ ఆదాయానికి తీవ్రంగా గండి కొడుతున్నారనడంలో సందేహం లేదు. ప్రయాణికుల సౌకర్యార్థం ఇటీవల ఆరు అద్దె బస్సులను రాష్ట్ర మంత్రి ప్రారం భించారు. వీటిని ప్రయాణికుల కోసం కాకుండా అద్దె బస్సుల డ్రైవర్లు వారి యజ మానుల లాభాల కోసం కిలోమీటర్లు పూర్తయ్యేందుకే నడిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయినప్పటికీ అధికారులు అద్దె బస్సులను ఎందుకు తీసుకుంటున్నారో ప్రయాణికులకు అర్థం కాక అల్లాడుతున్నారు.

రాయచోటి డిపో నెల టార్గెట్ రూ.5.90 కోట్లు

రాయచోటి ఆర్టీసీ డిపో టార్గెట్ రూ.5.90 కోట్లు కాగా గత నవంబరు నెలలో రూ.4.86 కోట్లు రాగా.. ఒక కోటి 10 లక్షలు నష్టాల బాటలోనే డిపో నడిచింది. డిపో టార్గెట్ ప్రకారం కిలోమీటర్‌కు రోజుకు 42.47 పైసలు ఆదాయం రావాల్సి ఉంది. రోజుకు 48,296 కిలోమీటర్లు చొప్పున నెలకు 14.44 లక్షల కిలోమీటర్లు తిరగాల్సి ఉండగా గత నవంబరు నెలలో 12.92 లక్షల కిలోమీటర్లు మాత్రమే బస్సులు నడిచాయి. మరమ్మత్తులు, కండం సర్వీసుల పేరుతో టైం సరిపోవడం లేదని ఎన్నో రకాల సర్వీసులు ఆగిపోతుండడంతో రెండు లక్షల కిలోమీటర్ల మేర బస్సులు తిరగకపోవడంతో ప్రతినెలా రాయచోటి ఆర్టీసీ డిపో రూ.కోటి నుంచి కోటి 20 లక్షల వరకు నష్టాలతో నడుస్తోంది. ఇలా ఎన్నో రకాలుగా ఆర్టీసీ నష్టాల బాటలో నడుస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. కనీసం ప్రైవేటు వాహనాలను నియంత్రించి ఆర్టీసీని మరింత ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాలు చేయకపోవడంతో రోజు రోజుకు రాయచోటి ఆర్టీసీ డిపోను నష్టాలు వెంటాడుతున్నాయి.

ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

రాయచోటి ఆర్టీసీ డిపో నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే సర్వీసులు సక్రమంగా నడవ కపోవడంతో ఆయా ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు మాత్రం ప్రైవేటు వాహ నాలను ఆశ్రయిస్తున్నారు. ముఖ్యంగా రాయచోటి డిపో నుంచి ఆరోగ్యపురం, గుంతరాచపల్లి, కటకాడపల్లి, వడ్డపల్లి, కమలామర్రి, సుండుపల్లె, రాయవరం, గడికోట, వంగిమళ్ల, పందిళ్లపల్లి, చెంచురెడ్డిగారిపల్లె, సొంఠంవారిపల్లె, కలిచర్ల, పెద్దమండెం, పింఛా, పుత్తావాండ్లపల్లి ఇలా ఎన్నో రకాల పల్లెలకు కాలం చెల్లిన బస్సులు నడుపుతుండటంతో ఎక్కడపడితే అక్కడ ఆగిపోతున్నాయి. దీంతో పల్లెల నుంచి పలు పనులపై రాయచోటి పట్టణానికి వచ్చే ప్రయాణికులు గమ్యస్థానాలను చేరుకునేందుకు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో చెప్పిన విధంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తే.. ఆర్టీసీ అధికారులు బస్సు లను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తారా లేదా అనే అనుమానాలు వ్యక్తమ వుతున్నాయి.

సురక్షిత ప్రయాణాన్ని అందించేందుకు కృషి చేస్తున్నాం..



రాయచోటి ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించేందుకు కృషి చేస్తున్నాం. అద్దె బస్సులపై వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. అద్దె బస్సుల యజమానులతో పాటు డ్రైవర్లకు కూడా కౌన్సెలింగ్ ఇస్తున్నాం. ఆర్టీసీ నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటున్న అద్దె బస్సుల యజమానులకు జరి మానాలు విధిస్తున్నాం. ప్రయాణికులకు ఇబ్బంది కలిగించే విధంగా నడుచుకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నాం. అక్కడక్కడ చిన్న చిన్న రిపేర్లతో ఆగిపోతున్న బస్సులను ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేపడుతూ ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. భవిష్యత్తులో పలు మార్గాల్లో అక్రమంగా తిరుగుతున్న ప్రైవేటు వాహనాలను నియంత్రించి.. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తాం.

- ధనుంజయ, ఆర్టీసీ డిపో మేనేజర్,రాయచోటి

భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తన నివాసంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో భూ సమస్యలు పరిష్కారానికి నోచుకోక ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భూ సమస్యలపై ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. దీంతో ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు ప్రజాదర్బార్ కార్యక్రమాలు నిర్వహించి భూసమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. రాయచోటి నియోజకవర్గంలో భూసమస్యలు అధికంగా ఉన్నందున ప్రతి మండలంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రెవెన్యూ అధికారులు భూ సమస్యలను ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయరాదన్నారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన అర్జీలను మంత్రి స్వీకరించి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. అనంతరం చిన్నమండెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తాగునీటి బోరును ప్రారం భించారు. ఆ తర్వాత పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులను తమ కన్న బిడ్డల్లా చూసుకొని మంచి విద్యాబుద్ధులు నేర్పాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పాఠశాలకు ప్రహరీగోడ, మరుగుదొడ్ల తదితర సమస్యలు ఉన్నాయని మంత్రి దృష్టికి తెచ్చారు.

పారదర్శకంగా సేవలు అందించాలి

సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ.. పారదర్శకంగా సేవలు అందించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చిన్నమండెంలోని గ్రామ సచివాలయాన్ని మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు వివిధ సమస్యలపై సచివాలయానికి వస్తుంటారని.. వారి అందించే దరఖాస్తులను పెండింగ్ లేకుండా నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చ రించారు.

హార్సిలీ హిల్స్‌లో అభివృద్ధి ఏదీ..!

● మొద్దునిద్ర వీడని టౌన్‌షిప్ కమిటీ

6

● అడుగు ముందుకు పడని ఒబెరాయ్ ప్రాజెక్టు

● ప్రతిపాదనలు దాటని రూ.కోట్ల పనులు

● పర్యాటకులకు రక్షణ కరువు



హార్సిలీహిల్స్ వ్యూ

నిరాశ్రయులకు ఒకరోజు సేవ చేయండి

● ఇసుక తరలిస్తూ పట్టుబడ్డ వారికి జడ్జి ఆదేశం

చెన్నూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డ పలువురికి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అఫెన్స్ కోర్టు జడ్జి హేమాస్రవంతి జానకీరామ్ ఒకరోజు సేవాశిక్ష విధించారు. చెన్నూరు మండలానికి చెందిన పి.గంగయ్య, డి.సుబ్బరాయుడు, కె.సుబ్రమణ్యం, టి.వెంకట మహేశ్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, జి.వెంకటసుబ్బారెడ్డి, కె.వెంకటరమణ ఇసుకను అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డారు. వీరిని జడ్జి ఎదుట హాజరుపరచగా.. నిరాశ్రయులకు, అభాగ్యులకు ఒకరోజు సేవ చేయాలని ఆదేశించారు. కొత్త చట్టాలలో భాగంగా వీరందరికీ సామాజిక సేవచేసే విధంగా శిక్ష విధించారు. కడప నగరంలోని మునిసిపల్ మైదానం వద్ద గల ఆర్తి ఫౌం డేషన్, ఆజాద్ నగర్‌లో గల బృంద స్ఫూర్తి ఫౌండేషన్, జిల్లా పరిషత్ కార్యాలయం సమీపంలో గల అనాధలు, అభాగ్యులకు ఒక రోజంతా సేవ చేస్తూ వారికి అవసరమైన సహాయ సహకారాలను అందించాలన్నారు. ఈ మేరకు అభాగ్యులు, అనాధలకు వీరు ఒక రోజంతా సేవ చేశారు. కాగా జడ్జి ఇచ్చిన సామాజిక సేవ శిక్షపై పలువురు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



అభాగ్యులకు సేవ చేస్తున్న నిందితులు

అన్ని పీహెచ్‌సీల్లో 172 రకాల మందులు

● విషజ్వరాలు ప్రబలుతున్నాయి..
● పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి
● లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదు
● కుక్కకాటుకు మందులు అందుబాటులో ఉన్నాయి..
● 'ఆంధ్రజ్యోతి'తో రాజంపేట డిప్యూటీ డీఎంహెచ్‌వో సానె శేఖర్



ముఖాముఖి

రాజంపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్నిరకాల వ్యాధుల నివారణకు ప్రభుత్వం 172 రకాల మందులను అందుబాటులో ఉంచిందని రాజంపేట డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సానె శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతితో పలు విషయాలు తెలిపారు.

ప్రశ్న: రాజంపేట, కోడూరుల్లో ఎన్ని ఆరోగ్య ప్రాథమిక కేంద్రాలున్నాయి?

జవాబు: రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో 16 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. అంతేగాక ప్రత్యేకంగా 64 సబ్‌సెంటర్లు ఉన్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సంపూర్ణంగా డాక్టర్లు, సిబ్బంది ఉన్నారు. అక్కడక్కడా స్టాఫ్‌నర్సులు, సీనియర్ అసిస్టెంట్ల కొరత ఉన్నా ఏఎన్ఎంలు కావాల్సినంతమంది ఉన్నారు.

ప్రశ్న: ప్రస్తుత సీజన్‌లో ఏయే వ్యాధులు సంక్రమిస్తున్నాయి? నివారణ చర్యలేమి?

జవాబు: ప్రస్తుత వర్షాకాలంలో ఎక్కువగా విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ఈ విష జ్వరాల నివారణకు అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాం. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, మురుగునీరు నిల్వ ఉండకుండా చేస్తే దోమలు లేకుండా ఉంటాయి. దోమలు విజృంభిస్తే తద్వారా జ్వరాలు విజృంభిస్తాయి.

ప్రశ్న: ఎన్ని స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి?

జవాబు: ఇక్కడ 28 స్కానింగ్ సెంటర్లు ఉండగా అందులో 4 ప్రభుత్వం నిర్వహిస్తుండగా 24 ప్రైవేటు వారు నిర్వహిస్తున్నారు. ఈ స్కానింగ్ కేంద్రాల్లో లింగనిర్ధారణ పరీక్షలు చేయరాదు. చేస్తే మూడేళ్ల జైలు శిక్షతో పాటు 5 లక్షల వరకు జరిమానా విధిస్తారు.

ప్రశ్న: ప్రభుత్వాసుపత్రుల ద్వారా గర్భిణులకు కల్పిస్తున్న సేవలేంటి?

జవాబు: గర్భిణులకు వారి గర్భంలో ఉన్న బిడ్డల సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మాతృత్వ యోజన (పీఎంఎంఈవై) పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆయా అంగన్వాడీ కేంద్రాల్లో వారి డేటాను నమోదు చేస్తే 6 వేల రూపాయల నగదుతో పాటు పుట్టిన బిడ్డకు టీకాలు వేస్తారు. నగదుతో పాటు పౌష్టికాహారం ఇస్తారు. అంతేగాక ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) పథకం కింద గర్భిణులకు మందులుతో పాటు స్కానింగ్ కూడా తీసి గర్భంలోని పిల్లల పరిస్థితిని గమనించి వారికి అన్నిరకాలుగా మందులు ఇస్తారు.

ప్రశ్న: కుక్క కాటుకు మందులున్నాయా?

జవాబు: కుక్క కాటుకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రధానంగా సుండుపల్లె, వీరబల్లె, రాజంపేట, నందలూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, కోడూరు, పుల్లంపేట, ఆకేపాడు తదితర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులను సిద్ధంగా ఉంచాం. ఎటువంటి కొరత లేదు.

ప్రశ్న: డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యంపై తీసుకుంటున్న చర్యలేమి?

జవాబు: ప్రధానంగా పేద ప్రజలు తమ గ్రామీణ ప్రాంతీయుల ఆరోగ్య పరిరక్షణ కోసమే ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలున్నాయి. వారి పట్ల వైద్యులు, సిబ్బంది ఎటువంటి నిర్లక్ష్యం వహించినా వైద్య పరీక్షల్లో ఎటువంటి అలసత్వం ప్రదర్శించినా మాకు ఫిర్యాదులు అందిన వెంటనే స్వయంగా వెళ్లి చర్యలు తీసుకుంటాము.

హార్సిలీహిల్స్‌లో.. అభివృద్ధి ఏదీ..?



హార్సిలీహిల్స్ వ్యూ

- మొద్దునిద్ర వీడని టౌన్‌షిప్ కమిటీ
- ముందుకు సాగని ఒబెరాయ్ ప్రాజెక్టు
- ప్రతిపాదనలు దాటని రూ.కోట్ల పనులు
- పర్యాటకులకు రక్షణ కరువు

బి.కొత్తకోట, డిసెంబరు 16: ఆంధ్రా ఊటీగా పేరుగాంచిన ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ప్రస్తుతం అచేతనావస్థలో ఉంది. ఆహ్లాదకరమైన వాతావరణంతో సముద్ర మట్టానికి 4312 అడుగుల ఎత్తులో ఉన్న ఈ కొండ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. వైసీపీ హయాంలో ఇక్కడ పర్యాటకరంగ అభివృద్ధికి పైసా విదల్చకపోగా ఉన్న ఆస్తులనే ధారాదత్తం చేయాలని విఫలయత్నం చేశారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాకతో హార్సిలీహిల్స్‌కు ఇకపై మంచిరోజులు వస్తాయనే ఆశలు చిగురించాయి. మరుగునపడిన ఒబెరాయ్ ప్రాజెక్ట్ సీఎం చంద్రబాబు చొరవతో ముందుకు కదిలింది. హార్సిలీహిల్స్ అభివృద్ధికి గతంలో రూపొందించిన మాస్టర్‌ప్లాన్ ప్రకారం జాతీయస్థాయి పర్యాటక కేంద్రంగా గుర్తింపు కోసం చేపట్టదలచిన రూ.కోట్ల పనులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. హిల్స్ పాలక మండలిగా ఉన్న టౌన్‌షిప్ కమిటీ నిద్రావస్థలో ఉండడంతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. కూటమి ప్రభుత్వం దృష్టి పెడితే కొండకు పట్టిన గ్రహణం వీడి జాతీయస్థాయిలో పర్యాటకులను ఆకర్షించే కేంద్రంగా ఉంటుంది.

ముందుకు సాగని ఒబెరాయ్ పనులు

అంతర్జాతీయ గుర్తింపు పొందిన ఒబెరాయ్ సంస్థకు గతంలో టీడీపీ సర్కార్ హిల్స్‌పై 20.80 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఈ స్థలంలో హెలీప్యాడ్‌తో పాటు రూ.200 కోట్లతో ఫైవ్‌స్టార్ హోటల్ నిర్మించాల్సి ఉంది. అయితే వైసీపీ దీన్ని నీరుగార్చింది. కూటమి సర్కార్ అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు దీనిపై దృష్టి సారించారు. సీఎం ఆదేశాలతో కలెక్టర్ చామకూరి శ్రీధర్ చర్యలు చేపట్టారు. ఈ ఏడాది ఆగస్టు 27న ఒబెరాయ్ సంస్థ లీగల్ అఫైర్స్ ప్రెసిడెంట్ ఆర్.శంకర్, ప్రాజెక్ట్ కన్సల్టెంట్ నవీన్‌గోస్వామి, ఇంజనీర్ మయాంక్ తనేజలను రప్పించి, కొండ భోగోళిక స్థితి, విశిష్టతను, హోటల్ నెలకొల్పేందుకు అనువైన పరిస్థితులను వివరించారు. సంస్థకు కేటాయించిన 20.80 ఎకరాల స్థలాన్ని చూపించారు. ఒబెరాయ్ బృందం సంతృప్తి చెంది, బోర్డు మీటింగులో చర్చించి సెప్టెంబరులో నిర్మాణపనులు చేపడతామని చెప్పడంతో హోటల్ నిర్మాణానికి మార్గం సుగమమైనట్లేనని అందరూ భావించారు. అయితే ఏం జరిగిందో ఏమో అది కార్యరూపం దాల్చలేదు.



హిల్స్‌పై ఒబెరాయ్ సంస్థకు కేటాయించిన స్థలం

ప్రతిపాదనలు దాటని అభివృద్ధి ప్రాజెక్టులు

హిల్స్ అభివృద్ధి కోసం ప్రతిపాదించిన ఎన్నో ప్రాజెక్టులు పెండింగ్‌లోనే ఉండిపోయాయి. 2014లో రోప్‌వే ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఢిల్లీకి చెందిన బృందం సైతం పర్యటించి సర్వే చేసింది. హిల్స్‌పై నుంచి దిగువనున్న అమరనారాయణపురం వరకు విశాఖ తరహాలో రోప్‌వేను నిర్మించాలని భావించారు. అది ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంది. ఏపీ టూరిజం హరిత రిసార్టుల నిర్మాణానికి రూ.6.50 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అటవీశాఖ ప్రాంగణంలోని జూపార్కులో జంతువులు, పక్షులు తగినన్ని లేవు. అటవీ ప్రాంగణంలోని నాలుగెకరాల బండపై సాహసక్రీడల సముదాయం ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది.

ఘాట్‌రోడ్డులోని మలుపులలో రహదారిని విస్తరించడంతో పాటు రక్షణగోడను నిర్మించాలన్న ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. కొండపై అంత ర్జాతీయస్థాయి క్రీడాకారులను తయారు చేయాలన్న లక్ష్యంతో క్రీడా శిక్షణ కేంద్రం కోసం 3.74 ఎకరాల స్థలం కేటాయించి క్రీడల సముదాయ నిర్మాణం కోసం రూ.3.20 కోట్లు మంజూరు చేయగా, ప్రహరీ మాత్రం నిర్మించి, మిగతా పనులు పెండింగ్‌లో పెట్టారు. ఇందులో వైసీపీ ప్రభుత్వం యాత్ర-2 దర్శక నిర్మాత మహీ వి.రాఘవకు 2.00 ఎకరాలు కట్టబెట్టాలని చూసింది. ప్రస్తుతం జిల్లా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి క్రీడామంత్రిత్వ శాఖలో ఉన్నా, దీనిపై తగిన చర్యలు తీసుకోలేదు.

శాపంగా నీటిసమస్య... పారిశుధ్య లోపం

హార్సిలీహిల్స్‌లో నీటి సమస్య, పారిశుధ్య లోపం పర్యాటకుల పాలిట శాపంగా మారింది. హిల్స్‌పై బోర్లు వేసే అవకాశం లేనందున దిగువనున్న గాలేటివారిపల్లె వద్ద వేసిన బోర్ల నుంచి నీటిని 5 కి.మీ పైపులైన్ ద్వారా 7 దశల్లో పంపింగ్ చేసి కొండమీదకు తరలిస్తున్నారు. దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం కావడంతో తరచూ సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయి. ప్రస్తుత అవసరాలకు తగ్గ నీరు సరఫరా కావడం లేదు. కొండపై నీరు కొనాల్సి వస్తోంది. ఈ సమస్య పరిష్కారం కోసం హంద్రీ-నీవా కాలువ ద్వారా దిగువన ఓ చెరువును అనుసంధానం చేసి కొత్తపైపులైనుతో పంపింగ్ కోసం రూ.3 కోట్లతో ప్రతిపాదనలు ఉన్నా నిధులు రాక అమలుకు నోచుకోలేదు. వాటర్ గ్రిడ్ పరిధిలోకి హార్సిలీహిల్స్‌ను తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామన్న కలెక్టర్ మాటలు కార్యరూపం దాల్చాల్సి ఉంది. పారిశుధ్య లోపంతో పర్యాటకులు అసహ్యించుకునే పరిస్థితి నెలకొంది. ప్రధాన రోడ్డు, పర్యాటకులు సంచరించే గాలిబండ లాంటి ప్రదేశాలలో చెత్త చెదారం, మురికినీటి ప్రవాహం హిల్స్ ప్రతిష్ఠను దిగజారుస్తున్నాయి.

నోటీసులు ఎంత మేరకు ఫలిస్తాయో..

హిల్స్‌పై భూమి స్వాధీనంలో ఉంచుకున్న, నిర్మాణాలు చేపట్టిన వ్యక్తులు, సంస్థలకు బి.కొత్తకోట మండల రెవెన్యూ అధికారులు ఇటీవల నోటీసులు జారీ చేశారు. తమ స్వాధీనంలో ఉన్న స్థలానికి సంబంధించిన డాక్యుమెంటును చూపించాలని, లేదంటే స్థలాన్ని ఖాళీ చేయించి స్వాధీనం చేసుకుంటామని అంటున్నారు. ఇది ఏ మేరకు సాధ్యమవుతుందో, అధికారులు ఏం చేస్తారో చూడాల్సి ఉంది.



టౌన్‌షిప్ కమిటీ కార్యాలయం ఎదుట దుస్థితి

నిద్రావస్థలో టౌన్‌షిప్ కమిటీ..

హిల్స్‌కు పరిపాలన కేంద్రంగా ఉన్న టౌన్‌షిప్ కమిటీ నిద్రావస్థలో ఉందని పలువురు విమర్శిస్తున్నారు. హిల్స్‌పై పర్యాటక రంగ అభివృద్ధి, ఆస్తుల రక్షణ కోసం చొరవ చూపాల్సిన టౌన్‌షిప్ కమిటీకి సబ్‌కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారు. ప్రతి మూడు నెలలకు సమావేశం నిర్వహించి అభివృద్ధి కార్యక్రమాలు, నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే సమావేశాలు లేకపోవడం, తగు చర్యలు తీసుకోకపోవడంతో అభివృద్ధి కుంటుపడింది. టోల్‌గేటు నిర్వహణతో ఈ ఏడాది రూ.46 లక్షలు వచ్చినా కొండపై కనీస సదుపాయాలు కల్పించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ కమిటీ ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు మరమ్మతులకు గురయ్యాయి. కొండపై అదనపు మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉంది. మరో వైపు కొండ పైనున్న 106 ఎకరాల భూమిలో బీఎస్ఎన్ఎల్, సీడీసీఎంఎస్, స్కౌట్ అండ్ గైడ్స్, సిరికల్చర్ తదితర శాఖలకు కేటాయించిన స్థలాలు ఇష్టారాజ్యంగా లీజులు ఇవ్వడం, చేపట్టిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పోలీస్ ఔట్‌పోస్టు ఉన్నా.. రక్షణ కరువు

హార్సిలీహిల్స్‌కు సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తారు. వీరికి రక్షణ లేకపోవడం కూడా హిల్స్‌కు ఓ లోపంగా మారింది. పర్యాటకుల రక్షణ కోసం అంటూ గత ముఖ్యమంత్రి జగన్ 2023 ఏప్రిల్ 14న హిల్స్‌పై పోలీస్ ఔట్‌పోస్టను వర్చువల్‌గా ప్రారంభించారు. అప్పటి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సైతం హాజరయ్యారు. ఆ స్టేషన్‌లో నిత్యం పోలీసులు అందుబాటులో ఉంటూ పర్యాటకులకు రక్షణ కల్పిస్తారన్నారు. అది కార్యరూపం దాల్చలేదు. ఆ పోలీస్‌స్టేషన్ అలంకార ప్రాయంగా మారింది. ఫిర్యాదు వస్తే వెళ్లడం తప్ప ఔట్‌పోస్ట్‌లో సిబ్బంది లేకపోవడంతో, కుటుంబాలతో వచ్చే పర్యాటకులకు ఆకతాయి యువకులు, మందుబాబుల నుంచి రక్షణ కరువైంది. అల్లర్లు షరా మామూలుగా మారాయి. శాశ్వత ప్రాతిపదికన సిబ్బందిని నియమించి పర్యాటకులలో భరోసా కల్పించాల్సి ఉంది.



అలంకారప్రాయంగా మారిన హిల్స్ పోలీస్‌స్టేషన్

అధ్యాపకుల సంఘం అధ్యక్షుడిగా రాఘవరెడ్డి

మదనపల్లె టౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా మలిగి రాఘవరెడ్డిని ఎన్నుకున్నారు. ఆదివారం రాత్రి విజయవాడలో ఎస్ఆర్ఆర్, సీవీఆర్ కళాశాలల్లో నిర్వహించిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌సమావేశాల్లో మదనపల్లెకు చెందిన రాఘవరెడ్డి అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తోటి అధ్యాపకులు రాఘవరెడ్డిని అభినందించారు.

108 సిబ్బంది ఔదార్యం



కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కడప నగర పరిధిలోని అప్సర సర్కిల్ వద్ద గల విద్యుత్ కార్యాలయ గేటు వద్ద సోమవారం గుర్తు తెలియని మహిళ ప్రసవించింది. పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. కాగా ఆమెకు సహాయకులు ఎవరూ లేరు. ఈ విషయమై స్థానికులు 108 సిబ్బందికి తెలుపగా వారు తక్షణం స్పందించి తల్లీబిడ్డను క్షేమంగా కడప రిమ్స్‌లో చేర్పించారు. 108 సిబ్బంది అయిన సీఎం బాషా, అబ్దుల్ రజాక్‌లను స్థానికులు అభినందించారు.

119 చౌక ధర దుకాణాలకు రీ నోటిఫికేషన్

మదనపల్లె టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోని 119 చౌకధర దుకాణాల డీలర్ల నియామకానికి సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ రీనోటిఫికేషన్ విడుదల చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు డివిజన్‌లో తాత్కాలిక డీలర్లు వున్న 74 చౌకధర దుకాణాకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులో బి.కొత్త కోట మండలంలో 6, కలికిరిలో 10, కురబల కోటలో 5, మదనపల్లెలో 11, ములకలచెరువులో 3, నిమ్మనపల్లెలో 6, పెద్ద మండ్యంలో 2, పీటీఎంలో 3, రామ సముద్రంలో 3, తంబళ్లపల్లెలో 6, వాల్మీకిపురంలో 19 చౌక ధర దుకాణలతో పాటు, పునర్విభజన జరిగిన 45 చౌకధర దుకాణాలకు కొత్తగా డీలర్ల నియామకం చేపడుతున్నామన్నారు. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ బదులు కొత్త నోటిఫికేషన్ అమలులోకి వస్తుందన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 21 సాయంత్రం ఐదు గంటలలోపు ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 28వ తేదీ రాత పరీక్ష వుంటుందని, 30,31 తేదీల్లో ఇంటర్వ్యూలు వుంటాయని సబ్‌కలెక్టర్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

కురబలకోట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. దీనికి సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కనసానివారిపల్లె పంచాయతీ సిద్దారెడ్డిగారిపల్లెకు చెందిన సిబి.అశోక్‌కుమార్ (32) గత సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేశాడు. కాగా ఆ సమయంలో వైసీపీకి చెందిన పలువురు రకరకాలు బెదిరింపులకు పాల్పడంతో పాటుగా అతని భార్య చేత కేసు పెట్టించారు. అయినా ఏ మాత్రం అధైర్యపడకుండా ఎన్నికల్లో పోటీ చేశాడు. అనంతరం టీడీపీ రాజంపేట పార్లమెంటరీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా క్రియాశీలకంగా పని చేశాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రపోయాడు. ఉదయం ఎంతసేపటికి నిద్ర లేవకపోవడంతో అతని తల్లి వెళ్లి నిద్రలేపగా మృతి చెందాడు. కాగా ఇతను ఒంటరితనం భరించలేక మృతి చెందాడా? లేక మరి ఏ ఇతర కారణంతో మృతి చెందాడో? తెలియడం లేదు. ఈ విషయం కుటుంబీకులకు తెలియడంతో అక్కడికి చేరుకుని బోరున విలపించారు.. కాగా పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ ఆసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

అర్ధరాత్రి ఆకతాయిల వెకిలి చేష్టలు

- గురుకుల కళాశాల వద్ద ఘటన
- పోలీసుల దృష్టికి సమస్య

వాల్మీకిపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణ సమీపాన తరిగొండ రోడ్డులో గల ఏపీ మైనార్టీ బాలికల జూనియర్ కళాశాల వద్ద ఆదివారం రాత్రి ఆకతాయిలు చేసిన వెకిలి చేష్టలు విద్యార్థినులను భయభ్రాంతులకు గురి చేసింది. వివరాలిలా.. స్థానిక బాలికల మైనార్టీ జూనియర్ కళాశాలలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని ఆకతాయి యువకులు మద్యం మత్తులో కళాశాల పక్క భాగంలోని ప్రహరీ ప్రాంతం నుంచి గోడ దూకి లోపలికి చొరబడి.. విద్యార్థినులను అసభ్య పదజాలంతో వేధించారు. దీంతో భయభ్రాంతులకు గురైన బాలికలు బిగ్గరగా కేకలు పెట్టడంతో కళాశాల మహిళా సిబ్బంది అప్రమత్తమయ్యారు. గమనించిన ఆకతాయి యువకులు కళాశాల ప్రాంగణం నుంచి పరారయ్యారు. సోమవారం ఉదయం కళాశాలలో ఈ విషయం చర్చనీయాంశంగా మారడంతో దావానంలా వ్యాపించింది. కళాశాల ప్రిన్సిపాల్ రమామంజుల జరిగిన సంఘటనను స్థానిక పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా మైనార్టీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల ఒకే ప్రాంగణంలో ఉండటంతో విద్యార్థినుల తల్లిదండ్రులు కూడా భయాందోళనలకు గురవుతున్నారు. పాఠశాలలో కానీ, బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఎక్కడా కూడా సీసీ కెమెరాలు లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు విద్యార్థినుల భద్రత విషయంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ విషయమై ప్రిన్సిపాల్ రమామంజుల మాట్లాడుతూ ఎలాంటి చిన్న సంఘటన కూడా కళాశాల ప్రాంగణంలో చోటు చేసుకోలేదని, ఆదివారం జరిగిన ఘటనపై పోలీసులకు తెలియజేశామన్నారు. ప్రహరీ నిర్మాణం విషయం స్థానిక మండల పరిషత్ అధికారులకు విన్నవించామని, కళాశాల ప్రాంగణంలో సీసీ కెమెరాల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.



వాల్మీకిపురం మైనార్టీ గురుకుల పాఠశాల సమీపాన అసంపూర్తిగా ప్రహరీ నిర్మాణం



పోలీస్ స్టేషన్‌కు కేటాయించిన స్థలానికి ఫెన్సింగ్

కురబలకోట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు సమీపంలో పోలీస్ స్టేషన్‌కు కేటాయించిన స్థలం అన్యాక్రాంతానికి గురి కాకుండా పోలీసులు పటిష్టంగా ఫెన్సింగ్ వేశారు. మదనపల్లెలో రోడ్డులోని కుమ్మర ఫ్యాక్టరీ పక్కన సర్వేనంబర్ 363-1లో 96 సెంట్ల భూమి ఉంది. ఈ భూమిని అప్పట్లో టెర్రకోట కేంద్రానికి వారి నివాసాలకు రెవెన్యూ అధికారులు పట్టాలను మంజూరు చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి 2019లో 10సెంట్ల స్థలాన్ని మంజూరు చేసింది. అయితే అప్పటి నుంచి ఈ స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టలేదు. కాగా ఈ స్థలం పక్కనే కొంత జాగా ఖాళీగా ఉండటంతో అంగళ్ళుకు చెందిన డిష్ కుమారి గణపతి ఆలయంను మూడేళ్ల క్రితం నిర్మించింది. కాగా ఈ ఆలయానికి వెళ్లేందుకు మార్గ ముందు స్థలంలో రోడ్డు వేయడానికి ప్రయత్నించగా, అడ్డుకోవడానికి ప్రయత్నించిన హెడ్‌కానిస్టేబుల్ హరిపై దాడిచేశారనే అభియోగాలపై వైసీపీకి చెందిన సర్పంచ్ విశ్వనాథరెడ్డి, దామోధర్‌రెడ్డి, గుణకుంట వారిపల్లెకు చెందిన కృష్ణమూర్తి, శ్రీనివాసులు, శివరాంలపై కేసు నమోదు చేసి రిమండ్‌కు తరలించారు. కాగా రెవెన్యూ అధికారులు అక్కడికి ఆ స్థలానికి వెళ్లి సర్వే చేసి హద్దులు నిర్ణయించడంతో ఫెన్సింగ్ వేశారు.

అక్రమ కట్టడాల కూల్చివేత ప్రారంభం

రాయచోటిటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాండవ్య నది ఒడ్డున బఫర్ జోన్‌లో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాల కూల్చివేత పనులను సోమవారం అధికారులు ప్రారంభించారు. గాలివీడు రోడ్డులోని బ్రిడ్జికి సమీపంలో అశోకొరెడ్డి అనే వ్యక్తి మాండవ్య నదిని ఆక్రమించడంతో పాటు బఫర్ జోన్‌లో నిర్మించిన భవనాలను మున్సిపల్ సిబ్బంది కూల్చివేశారు. కమిషనర్ వాసుబాబు పనులను పర్యవేక్షించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా కట్టడాలు నిర్మిస్తే కూల్చివేస్తామని ఈ సందర్భంగా కమిషనర్ హెచ్చరించారు.



మాండవ్యనది ఒడ్డున అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

పోలీస్‌స్టేషన్‌లో పందెంకోళ్లు..!



ఈ చిత్రంలో కనిపిస్తున్నవి మామూలు కోళ్లు కాదు.. కత్తికట్టి బరిలోకి దించే పందెం కోళ్లు. ఇవన్నీ బరిలో కాలు దువ్వకుండా ఇలా మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్‌లో సీఐ గది ఎదుట ఇలా తీరుతూ కనిపించాయి. కారణం పోలీసులు వీటిని పట్టుకోవడమే.
మదనపల్లె మండలం, చీకలబైలు గ్రామం మేడిపల్లె సమీపంలో కోడిపందెం ఆడుతున్నట్టు పోలీసులుకు సమాచారం వచ్చింది. దీంతో సోమవారం ఆకస్మికంగా దాడి చేసి 17మందిని పందెంరాయుళ్లను అరెస్టు చేశారు. 12 కోళ్లను, రూ.21,900 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇలా స్వాధీనం తీసుకున్న పందెంకోళ్లను తీసుకొచ్చి స్టేషన్ పైభాగాన సీఐ గది ఎదుట కట్టేశారు.

- (మదనపల్లె అర్బన్-ఆంధ్రజ్యోతి)

ఈ ఇసుక డంపులు ఎవరివి?

- చెరువు చుట్టూ ఇసుక డంపులే
- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

గుర్రంకొండ, డిసెంబరు 16: గుర్రంకొండ మండలంలో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. ఇసుకాసురులు పగటి పూట చెరువులు, కుంటల్లో ఇసుకను తవ్వి ట్రాక్టర్లలో రైతుల పొలాల్లో డంపు చేస్తున్నారు. ఇలా పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ఇసుక డంపులుగా ఉంచుతున్నారు. ఈ ఇసుక డంపులను చీకటి పడగానే రాత్రి పూట ఎక్స్‌కవేటర్ల సాయంతో టిప్పర్లకు లోడ్ చేసి బయట రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఇసుక డంపుల గురించి అధికారులకు ఎవరైనా రైతులు సమాచారమిస్తే వారిపై ఇసుకాసురులు దాడులకు పాల్పడుతున్నట్లు వాపోతున్నారు. అంతేకాకుండా చెరువులో ఇసుక మీ సొంత ఆస్తి కాదుగా అంటూ వారిని దుర్భాషలాడుతున్నారు. గుర్రంకొండ మండలంలో ఇసుక వ్యాపారం మూడు టిప్పర్లు ఆరు ట్రాక్టర్లు అనే విధంగా సాగుతోంది.

గుర్రంకొండ మండలంలోని పలు చెరువులను ఇసుకాసురులు చెరపట్టారు. ఇందులో భాగంగా రామానాయునిచెరువు, హరిహరాదులచెరువులో ఇసుకను తవ్వి బయటకు తరలిస్తున్నారు. ఈ చెరువుల్లో పగటి పూట ఇసుకను తవ్వి చుట్టూ ఉన్న రైతుల పొలాల్లో డంపు చేస్తున్నారు. రామానాయునిచెరువు చుట్టూ ఉన్న రుద్రవారిపల్లె, ఇరగన్నగారిపల్లె, రేగడపల్లె గ్రామాల్లోని రైతుల పొలాల్లో అక్కడక్కడ పది లోడ్ల ఇసుకను డంపు చేసి ఉంచారు. ఈ ఇసుక డంపులను రాత్రి పూట టిప్పర్‌లకు లోడ్ చేసి బయట ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. ఇసుక డంపుల గురించి పక్కపొలాల్లోని రైతులు అధికారులకు సమాచారమిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయంటూ వారిని ఇసుకాసురులు హెచ్చరిస్తున్నారు. దీంతో ఇసుక డంపుల గురించి చెప్పడానికి ప్రజలు, రైతులు ముందుకు రావడం లేదు.

ఇసుక డంపులుంటే సీజ్ చేస్తాం

అధికారుల అనుమతి లేకుండా ఇసుకను తరలించరాదు. ఇసుకను అక్రమంగా తరలించి నిల్వలు ఉంచరాదు. అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను గురించి సమాచారమిస్తే సీజ్ చేసి కేసు నమోదు చేస్తాం.

- మధురామచంద్రుడు, ఎస్ఐ, గుర్రంకొండ



రామానాయుని చెరువు సమీపంలోని పొలాల్లో డంపు చేసిన ఇసుక

అధికారులను కదిలించిన 'ఆటో గంగమ్మ'

చేయూతనిస్తామన్న ట్రైబల్ వెల్ఫేర్ కార్పొరేషన్



ఆటో గంగమ్మ వివరాలు తీసుకుంటున్న వెలుగు ఏపీఎం ఓబులేసు

కొండాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బతుకు భారమై.. ఆటో నడుపుతూ, ఆదర్శంగా నిలుస్తున్న ఆటో గంగమ్మ కథనం అధికారులను కదిలించింది. ట్రైబల్ వెల్ఫేర్ కార్పొరేషన్ నుంచి ఫోన్ చేసి ఆటో గంగమ్మ డేటా, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రుణం మంజూరు చేయించేందుకు సిద్ధమయ్యారు. వివరాల్లోకెళితే....

కొండాపురం మండలం గండ్లూరు ఎస్టీ కాలనీ వాసి గంగమ్మ కుటుంబం ఒక పూరి గుడిసెలో ఉంటోంది. గంగమ్మకు భర్త రవి, ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు, నలుగురు చెల్లెల్లు, ఒక తమ్ముడు, తల్లిదండ్రులు అరుణ, గంగన్న ఉన్నారు. వీరంతా గంగమ్మతోనే ఉంటున్నారు. భర్త రవి అనారోగ్యం కారణంగా ఇంట్లోనే ఉంటున్నాడు. గండికోట ముంపునకు గురైన గంగమ్మ ఇంటికి పరిహారం అందలేదు. ఆటో తెచ్చుకునేందుకు రుణం కావాలని, బ్యాంకుల చుట్టూ, అధికారులు చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా రుణం మంజూరు కాలేదు. బంధువుల నుంచి ఆటోను అద్దెకు తెచ్చుకుని ఆటో నడుపుతూ పెద్దకుటుంబాన్ని పోషిస్తోంది. దీంతో 'బతుకు భారమై.. ఆటో నడుపుతూ, ఆదర్శంగా నిలుస్తున్న ఆటో గంగమ్మ' శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ట్రైబల్ వెల్ఫేర్ కార్పొరేషన్ గంగమ్మ వివరాలను అడిగి తెలుసుకున్నారు. డీఆర్‌డీఏ జిల్లా అధికారుల ఆదేశాలతో వెలుగు ఏపీఎం ఓబులేసు సోమవారం సాయింత్రం గంగమ్మ ఇంటికి వచ్చి వివరాలు తీసుకున్నారు. గంగమ్మ డ్వాక్రా గ్రూపులో ఉన్నందున్న ఆమెకు రుణం ఇప్పించేందుకు తగిన వివరాలు తీసుకున్నట్లు ఏపీఎం తెలిపారు. తక్షణమే తనకు సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు గంగమ్మ తెలిపింది.

కబడ్డీ ఎంపికలకు అనూహ్య స్పందన



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ డిసెంబరు 16, (ఆంధ్రజ్యోతి): జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి కడప జిల్లా జూనియర్స్ బాల, బాలికల కబడ్డీ ఎంపికలకు ఔత్సాహిక క్రీడాకారుల నుంచి అనూహ్య స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి సుమారు వంద మంది క్రీడాకారులు హాజరయ్యారు. డీఎస్‌డీఓ జగన్నాథరెడ్డి, ఏపీ పీఈటీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ (అన్నమయ్య జిల్లా) వీరాంజనేయులు క్రీడకారులను పరిచయం చేసుకున్నారు. తదనంతరం పోటీలు నిర్వహించారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 22 నుంచి 25 వరకూ ఈస్ట్ గోదావరి జిల్లా రావులపాలెంలో జరుగనున్న అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొనాల్సివుంటుందని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకటసుబ్బన్న వెల్లడించారు. కార్యక్రమంలో డీఎస్ఏ కబడ్డీ కోచ్ ఆర్‌వీ శ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ జె. సుబ్బన్న, ట్రెజరర్ కొండయ్య డోనర్ పాల్గొన్నారు.

తైక్వాండోతో విద్యార్థినుల్లో మానసిక ధైర్యం : వీసీ



విద్యార్థినులకు సూచనలు చేస్తున్న వీసీ కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తైక్వాండో ఆత్మవిశ్వాసం పెంచి మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది, ధైర్యంగా ముందుకెళ్లగలిగేలా తయారుచేస్తుందని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఫిట్ ఇండియా వారోత్సవాల్లో భాగంగా వైవీయూ వసతి గృహాల విద్యార్థినులకు క్యాంపస్‌లో తైక్వాండో శిక్షణ తరగతులను పీజీ కళాశాల ప్రధానాచార్యులు, హాస్టల్ చీఫ్ వార్డన్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి, కులసచివులు ఆచార్య పి.పద్మ తో కలిసి ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ తైక్వాండో మానసిక క్రమశిక్షణ మాత్రమే కాక క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తుందన్నారు. భయం మనిషిని అచేతనంగా చేస్తుందని, ధైర్యం అనంత శక్తిని ఇస్తుందని ఉద్బోధించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, వసతి గృహ సంక్షేమ అధికారి డాక్టర్ సునీత, విద్యార్థినులు పాల్గొన్నారు.

10 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత - ఇద్దరు అరెస్ట్

రాజంపేట టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం కడప - చెన్నై హైవేలో మినీ లారీలో తీసుకెళుతున్న 10 టన్నుల రేషన్ బియ్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు మన్నూరు సీఐ మహ్మద్‌అలీ తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టాటా మినీ వాహనంలో చౌక బియ్యం అక్రమ రవాణా చేస్తుండగా పట్టుకున్నామన్నారు. తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణం మాసాపేట వాసి కంపా అంకయ్య, అనంతపురం జిల్లా గుంతకల్ పట్టణం బుచ్చిరోడ్డుకు చెందిన ఎరుకుల వెంకటరాఘవయ్య 150 బస్తాలతో 10 టన్నుల రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశామన్నారు. వాహనాన్ని, బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించామని సీఐ తెలిపారు.

పురాతన కత్తెరగండ్ల శివాలయం తొలగింపు





శిథిలావస్థకు చేరిన శివాలయం - యంత్రాలతో తవ్వి శిథిలాలను తొలగిస్తున్న దృశ్యం

కాశినాయన డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా శిథిలావస్థకు చేరిన చెన్నవరం సమీపంలోని అతిపురాతనమైన ఇష్టకామేశ్వరి దేవి సమేత సాంబశివస్వామి ఆలయాన్ని(కత్తెరగండ్ల శివాలయాన్ని) సోమవారం అధికారుల సమక్షంలో నిర్వాహకులు తొలగించారు. ఇందుకోసం 3 రోజులుగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సోమవారం పోలీసు, రెవెన్యూ అధికారుల సమక్షంలో శివాలయంలోని విగ్రహాలను బాలాలయంలోకి మార్చారు. అనంతరం గుడిని యంత్రాలతో తవ్వి శిథిలాలను తొలగించారు. ఈగుడిని పాండవుల మునిమనవడు జనమేజయ మహారాజు ప్రతిష్ఠించినట్లు స్థానికులు తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు

సిద్దవటం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): టక్కోలి అరుంధతివాడలో ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణలో నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలియజేశారు. ఏఎస్ఐ సుబ్బరామ చంద్ర మాట్లాడుతూ ఆదివారం రాత్రి అరుంధతీ వాడలో జేమ్స్ బాబు, వంశీబాబు, జయరాజ్ మల్లికార్జున అతని తల్లిదండ్రులపై దాడి చేశారు. మల్లికార్జునకు బలమైన గాయమవడంతో కడప రిమ్స్‌కు తరలించామన్నారు. బాధితుడి అన్న నేలటూరి ఈశ్వరయ్య ఫిర్యాదుపై నలుగురిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

మూగజీవాలకు స్వేచ్ఛ

పశువుల నిర్బంధంపై తహసీల్దారు ఆగ్రహం ● యానిమల్ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరిక

గదికి అడ్డంగా పాతిన బండలు తొలగింపు ● బయటకు తరలించిన అధికారులు



ఎద్దును బయటికి తీసుకొస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): దాయాదుల మధ్య తలెత్తిన పంతాలు, పట్టింపుల మధ్య నలిగి ఐదు రోజులు నిర్బంధంలో ఉన్న మూగజీవాలు స్వేచ్ఛావాయువులు పీల్చుకున్నాయి. ప్రొద్దుటూరు తహసీల్దారు గంగయ్య, ప్రొద్దుటూరు రూరల్ ఎస్ఐ మహ్మద్‌రఫి నంగనూరుపల్లెకు చేరుకుని నిర్బంధంలో ఉన్న జీవాలను విడుదల చేశారు. దీంతో పశువులు బయటికి వచ్చి స్వేచ్ఛా గాలులు పీల్చుకున్నాయి. వివరాల్లోకెళితే....

ప్రొద్దుటూరు మండలం నంగనూరుపల్లె వాసి మేకల చెన్నమ్మ కుటుంబం వ్యవసాయం చేసి జీవించేది. మూడేళ్ల కిందట చెన్నమ్మ భర్త గంగయ్య మృతిచెందడంతో అప్పటి నుంచి కుమారుడు వరుసయ్యే శ్రీనివాసుల వద్ద చెన్నమ్మ ఉండేది. కాగా శ్రీనివాసులు అతని సోదరులు వెంకటసుబ్బయ్య, నాగార్జున మధ్య ఆస్తి భాగపరిష్కార విషయం, రస్తా వివాదంలోనూ మనస్పర్థలుండేవి. దీంతో శ్రీనివాసులుకు చెందిన పశువులు ఉంచే గది ముందు బండలు నాటారు. దాయాదుల పంతాలు, పట్టింపుల ముందు మూగజీవాల ఆవేదన ఓడిపోయింది. పశువుల కన్నీటి రోధన కాఠిన్య హృదయాలను కదిలించలేకపోయింది. మూడు రోజులు తిండి, నీరు లేక చీకటి గదిలో గడిపాయి. ఈవిషయంపై ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రచురితమైన 'మూగజీవాల నిర్బంధం' శీర్షిక అధికారులను కదిలించింది. సోమవారం మధ్యాహ్నం తహసీల్దారు గంగయ్య, ఎస్ఐ మహమ్మద్‌రఫి ఇన్‌చార్జి వీఆర్వో హర్ష, ఇన్‌చార్జి సచివాలయ కార్యదర్శి చండీశ్వరి, సర్వేయర్ సయ్యద్ మహ్మద్‌యూసూఫ్, తమ సిబ్బందితో కలిసి నంగనూరుపల్లెకు చేరుకున్నారు. ఘటనా స్థలి ని పరిశీలించి మూగజీవాలపై పాల్పడిన దుశ్చర్యపై తహసీల్దారు ఆగ్రహిస్తూ పశువులను బంధించడం అమానుష చర్య అని హెచ్చరించారు. పాతిన బండలు తొలగించాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. రూరల్ ఎస్ఐ రఫి, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది, కలిసి బండలను తొలగించగానే పశువులు బయటికి వచ్చి స్వేచ్ఛా గాలులు పీల్చుకున్నాయి. తహసీల్దారు ఇరువర్గాలను ఉద్దేశించి మాట్లాడుతూ ఇలాంటి చర్యలు పునరావృతమైతే అనిమల్ క్రూయల్టీ యాక్టు 1960 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటూ క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఆడ, మగ అనే తేడా ఉండదని చట్టం దృష్టిలో అంతా సమానమేనని హెచ్చరించారు. వివాదాస్పద స్థలాన్ని సర్వేయర్‌చే కొలతలు వేయించగా ఆ జాగాలో 105 లింకుల కాల్వ పోరంబోకు స్థలం ఉందని తేల్చారు. ఈ జాగా ఎవరి సొత్తు కాదని నిర్ధారించారు. గ్రామంలో వివాదాలు, జీవాల నిర్బంధంపై దారితీసిన వైనాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లని రెవెన్యూ సిబ్బందిపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. నంగనూరుపల్లెలో రెగ్యులర్ వీఆర్వో, కార్యదర్శులు లేరని, ఇన్‌చార్జి సిబ్బంది తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లారు. రూరల్ ఎస్ఐ మాట్లాడుతూ 11వ తేదీన బండలు నాటిన సమయంలో చోటు చేసుకున్న సంఘటనలో మేకల శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి నిందితులైన నాగార్జున, వెంకటసుబ్బయ్య, వెంకటశివను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామని, ఈ కేసులో మరోముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని వివరించారు.





గదికి అడ్డంగా నాటిన బండలు - తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కార్యదర్శులపై డీఎల్‌పీఓ విచారణ

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గోపవరం పంచాయతీ పరిధిలో గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులు గురుమోహన్, రామమోహన్‌పై డీఎల్‌పీఓ తిమ్మక్క విచారణ చేపట్టారు. పంచాయతీ పరిధిలో అవినీతి జరిగిందని సమాచార హక్కు ద్వారా మార్తల వెంకటసుబ్బారెడ్డి జడ్పీసీఈఓకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం డీఎల్‌పీఓ గోపవరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించి అప్పట్లో విధులు నిర్వహించిన కార్యదర్శులు గురుమోహన్, రామమోహన్ సంజాయిషీ నమోదు చేసుకున్నారు. గతంలో వీరు లేఅవుట్ల విషయంలో బిల్డింగ్ అప్రూవల్, ఇంటి పన్నుల వసూళ్ల తదితర అంశాల్లో రెండు మూడేసి రశీదులు జారీ చేసి అవినీతికి పాల్పడ్డారని ఫిర్యాదుపై ఆమె విచారణ నిర్వహించారు. ఫిర్యాది వద్ద ఉన్న ఆధారాలు అందిస్తే నోటీసులు జారీ చేసి విచారణ జరుపుతామని డీఎల్‌పీఓ కోరగా త్వరలో అందజేస్తానని వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. కార్యదర్శుల సంజాయిషీ తీసుకుని జడ్పీసీఈఓకు నివేదిక పంపనున్నట్లు తిమ్మక్క వివరించారు.

ఫ్లైయాష్ మీద పడి....

● ఆర్టీపీపీ కాంట్రాక్టు కార్మికుడు మృతి
● పరిహారం కోరుతూ మెయిన్ గేటు వద్ద ధర్నా



మెయిన్ గేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆర్టీపీపీ కార్మిక సంఘం నేతలు (ఇన్‌సెట్‌లో) సందీప్ కుమార్ మృతదేహం

ఎర్రగుంట్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీలో 600 ప్లాంటు ఈఎస్‌పీ ఫ్లైయాష్ ఆఫర్ వద్ద నాగార్జున కంపెనీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుడు పగిడికాల్వ సందీప్ కుమార్(28) మృతి చెందాడు. వివరాల్లో కెళితే... మూడు వారాలుగా ప్లాంటు షట్‌డౌన్ పనులు చేస్తున్నారు. ఈఎస్‌పీ వద్ద గడ్డకట్టిన ఫ్లైయాష్ తొలగింపులో కదిరివారిపల్లె వాసి సందీప్ పనిచేస్తున్నాడు. ఒక్కసారిగా ఫ్లైయాష్ అతనిపై పడడంతో అందులో కూరుకుపోయి ఊపిరాడక మృతి చెందాడు. తోటి కార్మికులు అతన్ని వెలికి తీసి ప్రాజెక్టు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు.

మృతిచెందిన కార్మికునికి పరిహారం విషయంలో కంపెనీ స్పందించకపోవడంతో కార్మిక సంఘాలు మృతదేహాన్ని ఫౌంటేన్ ప్రధానగేటు వద్ద ఉంచి ధర్నాకు దిగారు. సాయంత్రం వరకు చర్చలు జరిగాయి. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి, ఇతర కార్మిక సంఘనేతలు వారితో మాట్లాడారు. కంపెనీ నుంచి రూ.15లక్షలు నగదును ఇచ్చేందుకు ఒప్పించారు. కార్మికుని కుటుంబానికి జీఓ నెంబరు 129ప్రకారం ఆర్టీపీపీలో మెంటెనెన్స్‌లో ఉద్యోగం ఇచ్చేందుకు సీఈ కూడా అంగీకరించినట్లు కార్మిక వర్గాలు తెలిపాయి. దీంతో బాధితులు ధర్నా విరమించారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పరీక్ష నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇటీవల ఇలాంటి ప్రమాదాలు తరచూ జరగడంతో కాంట్రాక్టు కార్మికులకు భద్రత కరవైందని, యాజమాన్యాలు కనీస భద్రత కల్పించడం లేదని కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. ఇకపై ఇలాంటివి పునరావృతం కాకుండా కార్మికుల జీవితాలకు గట్టి భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో చిన్నకు స్వర్ణ పతకం



దువ్వూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో శని, ఆదివారాల్లో జరిగిన యోగివేమన యూనివర్శిటీ పరిధి పోటీల్లో డి.చిన్న స్వర్ణపతకం సాధించారు. ప్రొద్దుటూరు వాసి చిన్న పుల్లారెడ్డి పేటలోని డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్నారు. ఇతడు యూనివర్శిటీ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించారు. ఇదే విద్యార్థి బెస్ట్ ఫిజిక్ పోటీల్లో రెండో స్థానంలో నిలిచి వెండి పతకం గెలుపొందాడు. ఇదే కాలేజీకి చెందిన విద్యార్థులు కబడ్డీ పోటీల్లో 3వ స్థానంలో నిలిచారు. వీరికి సర్టిఫికెట్లు, మెమెంటోలను అందజేశారు. సోమవారం విజేతలను కాలేజీ కరస్పాండెంట్ ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, వ్యాయామ అధ్యాపకుడు కన్నయ్య అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



నాగయ్య మృతదేహం

రామాపురం, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలగిరి నాగయ్య (71) మృతి చెందగా గూడూరు బాషాకు తీవ్రగాయాలైనట్లు ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. రాయచోటి పట్టణం మాసాపేట వాసులు పాలగిరి నాగయ్య, గూడురు బాషా ఆదివారం కడపలో జరిగిన ఇష్టిమాకు వెళ్లి తిరిగి ఇంటికి మోపెడ్‌లో బయలుదేరారు. వీరి వాహనం కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై రామాపురం మండలం బండపల్లి పంచాయతీ పరిధి ఆటోనగర్ వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పాలగిరి నాగయ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివా రం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మధ్యవర్తిత్వమే పరిష్కార మార్గం

కడప రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం చక్కటి ప్రక్రియ అని మొదటి అదనపు జిల్లా జడ్జి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో సోమవారం మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు శిక్షణలో ఆయన మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడంతో పాటు ఖర్చు, సమయం ఆదా అవుతాయన్నారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో రాజీ మార్గమే రాజమార్గమన్నారు. ఖర్చు లేకుండా కక్షిదారులకు సత్వర న్యాయసేవలందించే లక్ష్యంతో సుప్రీంకోర్టు 1987లో న్యాయసేవాధికార సంస్థల చట్టాన్ని రూపొందించిందన్నారు. తద్వారా వ్యక్తుల మధ్య తగాదాలను రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తారన్నారు.

'బాధితులకు న్యాయం చేయండి'

కడప(క్రైం)డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం పోలీసు స్టేషన్‌కు వచ్చే వారి సమస్యలను తెలుసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఏఎస్పీ(పరిపాలన) ప్రకాష్‌బాబు సిబ్బందిని ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యలు అడిగితెలుసుకుని సంబంధిత పోలీసు స్టేషన్‌లకు బదిలీ చేశారు.

ఆరు ఎర్రచందనం దుంగల స్వాధీనం

రాజంపేట టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చెయ్యేరు నదీ ప్రాంతంలో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్న ఒకరిని సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీలు జి.బాలిరెడ్డి, వి.శ్రీనివాసరెడ్డి మార్గనిర్దేశకత్వంలో కడప సబ్ కంట్రోల్ సానిపాయ బేస్ ఆర్ఐ చిరంజీవులకు చెందిన ఆర్ఎస్ఐ వై.విశ్వనాథ్ టీమ్ ఆదివారం నుంచి జాండ్రపెంట ఎఫ్‌బీవోతో కలిసి గుర్రపుబాట తూర్పు వైపున గల చెయ్యేరువైపు కూంబింగ్ చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున వీరు మేకలకోన వద్దకు చేరుకోగా అక్కడ కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు. వీరు పోలీసులను చూసి పారిపోగా ఒకరిని పట్టుబడ్డారు. అక్కడున్న ఆరు దుంగలను స్వాధీనం చేసుకుని నిందితుడిని తిరుపతికి తరలించారు.

కాల్వలో యూసీఐఎల్ ఉద్యోగి మృతదేహం



రామాంజనేయులు మృతదేహం

పులివెందుల టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): యూరేనియంలో ఏఎండి ఆపరేటర్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రామాంజనేయులు (28) మృతదేహం కాల్వలో లభ్యమైంది. ఆదివారం సాయంత్రం నల్లపురెడ్డి పల్లె దారిలో ఉన్న కాల్వ గట్టున బైక్ గమనించిన స్థానికులు సమాచారంపై పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కాల్వలో గాలించారు. సోమవారం మృతదేహాన్ని బయటికి తీసి, ప్రభుత్వాస్పత్రికి తరలించి శవ పరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించామని పట్టణ సీఐ నరసింహులు తెలిపారు. మృతుని స్వగ్రామం వేమల మండలం, మబ్బు చింతలపల్లి కాగా ప్రస్తుతం ఎర్రగుడిపల్లెలో ఉంటున్నారు. మృతుడు ఆదివారం పూజలు చేయించుకుని పూజా సామగ్రిని కాల్వలో కలపడానికి వెళ్లి ప్రమాదవశాత్తు పడ్డాడని, ఈత రాక మునిగిపోయినట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందని సీఐ తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. వివరాలు పూర్తి విచారణ తర్వాత వెల్లడిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మైలవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు-తాడిపత్రి ప్రధాన రహదారిలో రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతున్న మద్దిరాల సుధాకర్ (48)ను వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందినట్లు తలమంచిపట్నం ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు దన్నవాడ వాసులు సుధాకర్, కుమారుడు యేసుదాసు ఇద్దరూ రోడ్డుకు ఓ పక్కన ముందు వెనుకగా నడుచుకుంటూ వెళుతున్నారు. జమ్మలమడుగు నుంచి రామ్‌కో సిమెంటు పరిశ్రమకు వెళుతున్న లారీ వెనుక వైపు నుంచి సుధాకర్‌ను ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందగా లారీ మరికొంచెం ముందుకెళ్లి ద్విచక్ర వాహనాన్ని సైతం ఢీకొట్టి లారీ సహా డ్రైవర్ పరారీ అయ్యారు. స్పందించిన పోలీసులు లారీని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుడు సుధాకర్ కూలి పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

స్వగ్రామానికి బాధితురాలు

మదనపల్లె టౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే షాజహాన్ బాషా, టీడీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రాటకొండ మధుబాబు చొరవతో తాను స్వగ్రామానికి చేరుకున్నానని కువైత్ బాధితురాలు పార్వతమ్మ వివరించారు. సోమవారం ఎమ్మెల్యే నివాసానికి భర్త శంకర్‌నాయక్‌తో కలిసి వచ్చిన ఆమె మాట్లాడుతూ తంబళ్లపల్లె మండలం పెద్దమండ్యం మండలం వడ్డివంక తండాఅని, కుటుంబం గడవక పోవడంతో రెండేళ్ల కిందట అప్పు చేసి కువైత్ వెళ్లానని పార్వతమ్మ చెప్పింది. అక్కడ సేఠ్‌లు తనను అరెస్టు చేయించి మానసిక క్షోభకు గురిచేశారన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయన కువైత్ ఎంబసీ అధికారులతో చర్చించారని, అలాగే మధుబాబుకు తెలిసిన కువైత్ అధికారితో ఫోన్‌లో మాట్లాడి తనను స్వదేశానికి వచ్చేందుకు వీలుకల్పించారన్నారు. తమ కుటుంబాన్ని కాపాడిన ఎమ్మెల్యే, మధుబాబుకు పార్వతమ్మ, శంకర్‌నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సిద్దవటం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్థానిక పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు మాట్లాడుతూ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించి రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నామని, వాటిని స్థానిక తహసీల్దారుకు అప్పజెపుతున్నట్లు వివరించారు. ఇన్‌చార్జి ఎస్‌ఐ శివప్రసాద్, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

స్థానికీకరణ, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

చిట్వేలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీపీ సభాభవనంలో ఈనెల 17, 18 తేదీల్లో ఉదయం 9.30 గంటలకు స్థానికీకరణ స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మోహన్ తెలియజేశారు. సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు, వీఆర్వోలు, గ్రామ సచివాలయాల సిబ్బంది హాజరు కావాలన్నారు. ఎంటీలుగా శిక్షణ పొందిన మండలస్థాయి అధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పీఆర్ ఏఈ, ఏపీఎంలు ఉదయం 9 గంటలకు శిక్షణకు హాజరు కావాల్సిందిగా ఎంపీడీవో కోరారు.

పుల్లంపేట ఇన్‌చార్జి ఎంపీడీవోగా వరప్రసాద్

పుల్లంపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పుల్లంపేట ఎంపీడీవో జయశ్రీ దీర్ఘకాలిక సెలవులపై వెళ్లడంతో వరప్రసాద్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రస్తుతం రాజంపేట ఎంపీడీవోగా పనిచేస్తున్నారు. హౌస్ హోల్డ్ జియోటాగింగ్ ఎంఎస్ఎంఈ రుణ సదుపాయం, ఎన్‌పీసీఐ కింద బ్యాంకు అకౌంట్లకు ఆధార్ లింక్ చేయడంపై ఆయన సచివాలయ సిబ్బందితో సమావేశమై సూచనలు ఇచ్చారు.

తాళ్లపాక మాజీ సర్పంచ్ ఉద్దండం బ్రహ్మయ్య మృతి



ఫైల్‌ఫొటో

రాజంపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సీనియర్ నాయకుడు తాళ్లపాక మాజీ సర్పంచ్ ఉద్దండం బ్రహ్మయ్య(76) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం తమ పొలం గట్టుపై కుప్పకూలిపోయి మృతిచెందారు. మేకల కాపరులు సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులు బ్రహ్మయ్య మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. ఆయన మృతిపట్ల టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతి నిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యెద్దల విజయ సాగర్, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్య దర్శి చెన్నూరు సుధాకర్, మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, హరి ట్రేడర్స్ అదినేత గుగ్గిళ్ల హరిప్రసాద్, టీచర్ల సంఘ నాయకులు సాయి తదితరులు సంతాపం వ్యక్తం చేసి ఆయన మృతదేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

ఏవో అనంతప్రకాష్‌కు సత్కారం

నందలూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఏవో అనంతప్రకాశ్ డెప్యుటేషన్‌పై కమలాపురానికి వెళుతుండడంతో సోమవారం మండల పరిషత్ అధ్యక్షుడు మేడా విజయ భాస్కర్ రెడ్డి, మండల సిబ్బంది ఆయనకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుజాతమ్మ, మండల కోఆప్షన్ సభ్యులు కలీముల్లాఖాన్, కాంట్రాక్టర్ నడివీధి సుధాకర్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే.. మునకే.!

- నిరుపయోగంగా రైల్వే అండర్ బ్రిడ్జి
- రైల్వే గేటు మూస్తే స్తంభిస్తున్న ట్రాఫిక్
- అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు

నందలూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దాదాపు కోటి రూపాయలకు పైగా వెచ్చించి నందలూరు రైల్వేస్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన రైలు అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిరుపయోగంగా మారింది. చినుకుపడితే చాలు మునిగి పోతుండడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మండలంలోని నాగిరెడ్డిపల్లె, పాటూరు గ్రామ పంచాయతీలతో పాటు రాజంపేటకు చెందిన తొగురుపేట పంచాయతీ ప్రజలు బస్టాండుకు, మండల కేంద్రానికి రావాలన్నా ఈ రైల్వేగేటు లేదా ఆర్‌యూబీ గుండా రావాల్సి ఉంటుంది. రైల్వేగేటు ఇరువైపులా వేల సంఖ్యలో గృహాలు, నివాస ప్రాంతాలు, వివిధ కార్యాలయాలు, పాఠశాలలు అధిక సంఖ్యలో ఉన్నాయి. ఈ మార్గంలో వాహన రాకపోకలు కూడా అధిక సంఖ్యలోనే ఉంటాయి. ప్రస్తుతం కన్యక చెరువు కాలువకు చెయ్యేరు నుంచి నీరు వదలడంతో ఆర్‌యూబీ మునిగిపోయింది. ఈ సమస్యను అధిగమించడంతోపాటు పెద్ద వాహనాలు సైతం వెళ్లేందుకు వీలుగా మరో ఆర్‌వోబీ నిర్మాణాన్ని అధికారులు ప్రారంభించారు. అయితే, ఈ పనుల్లో జాప్యం జరుగుతుండడంతో ప్రస్తుతం పాత ఆర్వోబీ నుంచి గానీ, రైలు గేటుమీదుగా గానీ పట్టాలు దాటాల్సిన పరిస్థితి ఉంది. ఆర్వోబీలో నీరు నిండిపోవడంతో రైలు గేటుమీదుగానే వెళ్లాల్సిన పరిస్థితి. ఈ మార్గంలో రైళ్ల రాకపోకలు అధికంగా ఉండడంతో ఎక్కువసేపు రైల్వే గేటు మూసి ఉంటుంది. దీంతో గేటు దాటేందుకు ప్రజలు గంటలకొద్దీ వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఆసుపత్రులకు వెళ్లేవారు, అత్యవసర పనులపై వెళ్లాల్సినవారు పలు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. కాబట్టి ఇప్పటికైనా సంబంధిత అధికారులు గట్టి చర్యలు తీసుకుని రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



నీట మునిగిన ఆర్‌యూబీ



గేటు పడడంతో నిలిచిపోయిన వాహనాలు

ఆర్‌యూబీ నిర్మాణంలో జాప్యం



రైలుగేటు మూసిన సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనుల్లో జాప్యం కొనసాగుతోంది. వీలైనంత త్వరగా ఈ పనులు పూర్తిచేసి రైల్వేగేటు సమస్య నుంచి ప్రజలను విముక్తులను చేయాలి.

\- సమ్మెట శివప్రసాద్, మాజీ సర్పంచ్ నాగిరెడ్డిపల్లె

అండర్ బ్రిడ్జి పనులు పూర్తి చేయాలి



రైల్వే బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి. రైలుగేటు మూసిన సమయంలో రోగులు, అత్యవసర పనులున్నవారి పని అగమ్యగోచరంగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్య పరిష్కరించాలి.

\- గురివిగారి వాసు, జనసేన నాయకుడు

అక్రమ కట్టడాలను సహించం!

- పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అక్రమ కట్టడాలు నిర్మిస్తే సహించేది లేదని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన ఎగువ అబ్బవరం హరిజనవాడలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాయచోటి మున్సిపాలిటీలో భూ ఆక్రమణలను నివారించి పేదలకు న్యాయం చేస్తామన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్ల యజమానులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. పట్టణానికి ఆనుకుని ఉన్న మాండవ్య నదిని ఆక్రమించి పలువురు అపార్టుమెంట్లు నిర్మించగా, కొంతమంది బఫర్‌జోన్ కూడా వదలకుండా భవనాలు నిర్మిస్తున్నారన్నారు. వీటన్నిటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. నది పరివాహక ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, నదిలో ప్రవాహం పెరిగితే నిర్మాణాలకు నష్టం చేకూరుతుం దన్నారు.

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి: పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రతి మండలంలో వీఆర్‌వో నుంచి తహసీల్దార్ వరకు రెవెన్యూ సమస్యలను తక్షణం పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను ఆర్డీవో, జాయింట్ కలెక్టర్ల దృష్టికి తీసుకెళతామన్నారు.

విద్యారంగానికి పెద్దపీట: గాలివీడు రోడ్డులోని అర్బన్ విద్యాసంస్థల్లో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే భాషలో పాఠాలు బోధించాలన్నారు. ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గత ప్రభుత్వ సమయంలో ఉపాధ్యాయులు ఎన్నో రకాల ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇక నుంచి అలాంటి సమస్యలు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు, రీసోర్స్ పర్సన్‌లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అక్రమ కట్టడాలను పరిశీలిస్తున్న రాష్ట్ర రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

నేడు సంబేపల్లెకు మంత్రి

సంబేపల్లె: మండలంలోని ఎస్. సోమవరం, శెట్టిపల్లె గ్రామాల్లో మంగళవారం జరిగే రెవెన్యూ సదస్సులకు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరవుతున్నట్లు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మల్లు నరసారెడ్డి తెలిపారు. భూ సమస్యలు ఉన్న రైతులు అధికారులకు అర్జీలు అందజేయాలన్నారు.

'ట్రైబల్' టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ట్రైబల్ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రైబల్ గురుకుల పాఠశాలల్లో పదేళ్లుగా పనిచేస్తున్న ట్రైబల్ టీచర్లు నెల రోజులుగా చేస్తున్న డిమాండ్లను పరిగణలోకి తీసుకోవాలన్నారు. వీరి స్థానంలో డీఎస్సీ నియామకాలను మినహాయించాలని కోరారు. ట్రైబల్ టీచర్స్ అసోసియేసన్ నాయకులు శ్రీనివాసులు నాయక్, సరోజ, హరిత మాట్లాడుతూ చనిపోయిన లేదా రిటైర్ అయిన వారి స్థానాల్లో డీఎస్సీ నియామకాలు చేస్తారని, ఔట్‌సోర్స్ పద్ధతిలో పనిచేసే వారిని తొలగించి, వారిని డిమోట్ చేసి పార్ట్‌టైం టీచర్స్‌గా మార్చే సంస్కృతి దేశంలో ఎక్కడా లేదన్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ టీచర్లు మహదేవ్, విజయకుమారి, స్వర్ణ, లక్ష్మీదేవి, రెడ్డెమ్మ, ప్రదీప్, సౌజన్య, దేవి, కాదంబరి, గీత, సుమతి, ప్రకాష్, వనిత, త్రివేణి, కల్పన, సుహాసిని , చందన, సుజాత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ట్రైబల్ గురుకుల పాఠశాల టీచర్లు

అయ్యప్ప, గోవింద మాలధారులకు అన్నదానం



భిక్ష స్వీకరిస్తున్న భక్తులు

సుండుపల్లె, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అన్నదానం చేయడం దేవుడిచ్చిన వరమని మాధురి స్కూల్ కరస్పాండెంట్ రేపన సుధాకర్ తెలి పారు. సోమవారం మండల కేంద్రంలోని విరూపాక్ష చెన్న కేశవ స్వామి ఆలయంలో గోవింద, అయ్యప్ప మాలధారులకు ఆయన అన్నదానం చేశారు. భక్తి శ్రద్ధలతో దీక్ష చేస్తున్న స్వాములకు భిక్ష ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రానాయక్, రెడ్డెయ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర భక్తులకు అన్న ప్రసాద వితరణ

రైల్వేకోడూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తిరుమల పాదయాత్రకు వెళుతున్న 6000 వేల మంది భక్తులకు సోమవారం రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్ రాజు ఆధ్వర్యంలో మండలంలోని కుక్కలదొడ్డి వద్ద అన్న ప్రసాదం పంపిణీ చేశారు. టీడీపీనేతలు గన్నే సుబ్బనరసయ్య నాయుడు, కొవ్వూరు సుబ్రహ్మణ్యం నాయుడు, ఆర్. సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం ఇవ్వకుండానే సదస్సులా?

- తహసీల్దారును ప్రశ్నించిన టీడీపీ నేతలు

ఒంటిమిట్ట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్ర తినిధులతో పాటు, గ్రామస్థులకు ఎలాంటి సమా చారం అందించకుండా రె వెన్యూ సదస్సు నిర్వహిం చడం ఏమిటని టీడీపీ నాయకులు కట్టా సుబ్బరా యుడు, పలుకూరు భా స్కర్ తహసీల్దారును ప్రశ్నిం చారు. సోమవారం మండల స్పెషల్ ఆఫీసర్ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో గంగ పేరూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామంలోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామస్తులతోపాటు, ఎంపీటీసీ సభ్యులకు, గ్రామంలోని ఇతర పెద్దలకు ఎవరికీ సమాచారం ఇవ్వకుండా గ్రామసభలు నిర్వహించడం ఏమిటని తహసీల్దారు రమణమ్మను ప్రశ్నించారు. . ఈ కార్యక్రమంలో డీటీ అంజనాగౌరి, ఆర్‌ఐ భాస్కర్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు ఆర్థికసాయం

రైల్వేకోడూరు(రూరల్), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పట్టణంలోని నరసాంరాంపేట ప్రాంతంలో పాక్షికంగా ఇళ్లు కోల్పోయిన షేక్. నూర్ జహాన్, షేక్. బాబు, గజ్జల లక్ష్మి నరసమ్మకు సోమవారం కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి రూ. 60 వేలు ఆర్థిక సాయం చేశారు. ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున చెక్కులు పంపిణీ చేశారు.



మైనింగ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పీలేరు నియోజకవర్గం కేవీపల్లి మండలంలోని అడవిపల్లి ప్రాజెక్టు కొండల్లో తమిళనాడు కూలీలతో అక్రమంగా మైనింగ్ చేయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, టీఎల్ వెంకటేశ్, సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేలాది ఎకరాలకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అడవిపల్లి ప్రాజెక్టు పనులు ప్రారంభించి, రూ. 2 వేల కోట్లకు పైగా ఖర్చు పెట్టిందని, ఇంకా రూ.260 కోట్లు ఖర్చు పెడితే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1.80 లక్షల ఎకరాలకు , పీలేరు నియోజకవర్గంలో 69 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన కొండల్లో కొందరు అక్రమంగా మైనింగ్ చేస్తున్నారన్నారు. దీని కారణంగా ప్రాజెక్టు ఉనికికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, అంజనప్ప, రామసుబ్బమ్మ, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు చిట్లూరులో ఉచిత వైద్య శిబిరం

రామాపురం, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): చిట్లూరు కస్పా శివాలయంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకుడు గాలివీటి సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. కిడ్నీ, ఎముకలు, కీళ్లు సంబంధించిన వ్యాధులకు ఉచితంగా వైద్యం చేస్తారని, ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శిబిరానికి వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, తమ వద్ద ఉన్న రిపోర్టులు తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు దేవదర్శన్‌రెడ్డి, దేరంగుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ స్థలం ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న నాగూరివాండ్లపల్లె ప్రజలు

గాలివీడు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాటమరాజు ఆలయ స్థలాన్ని ఆక్రమించినవారిపై చర్యలు తీసుకోవాలంటూ నాగూరువాండ్లపల్లె ప్రజలు సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో తహసీల్దారు భాగ్యలతకు ఫిర్యాదు చేశారు. నూలివీడు పంచాయతీ నాగూరువాండ్లపల్లెకు సమీపంలోని సర్వే నంబర్లు 1880, 1887లోని రెండు ఎకరాలకు పైగా భూమిని మేత బయలుగాను, ఏడాదికోసారి కనుమ ఉత్సవ నిర్వహణకు వినియోగిస్తుంటారు. ఆ భూమిని ఆ గ్రామానికి చెందిన ఒకప్పటి వీఆర్ఏ శ్రీనివాసులు తన పేరు మీద డీకేటీ పట్టా చేయించుకున్నాడని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన కొడుకు ఆ భూమి చుట్టూ కంచె వేయడానికి ప్రయత్నిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎప్పటి నుంచో ఉన్న దారిని మూసేస్తున్నాడని, ఆరోపించారు. గ్రామ ప్రజల సౌకర్యం దృష్ట్యా ఆ భూమిని ఆక్రమణ నుంచి కాపాడాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ఏర్పాటుకు ఉపసర్పంచ్ సహకారం



పంచాయతీ అధికారులకు పత్రాలను అందజేస్తున్న ఉప సర్పంచ్ తోట శివసాయి

రైల్వేకోడూరు(రూరల్), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రహదారి పనులకు అడ్డుగా ఉన్న ఇంటిని కొనుగోలు చేసి, దానిని పంచాయతీకి విరాళంగా అప్పగించి జగడంపల్లి ఉపసర్పంచ్ తోట శివసాయి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. పంచాయతీకి రోడ్డు సదుపాయం కల్పించాలని జగడంపల్లి వాసుల కల ఈ చర్యతో తీరిపోయింది. సర్పంచ్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఉపసర్పంచ్ తోట శివసాయి తన సొంత నిధులు వెచ్చించి ఇల్లు కొని పత్రాలను సోమవారం పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి ప్రసాద్, సర్పంచ్ బుడిగి శివయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా మాజీ వ్యవసాయి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, పట్టణ వైసీపీ నాయకులు సి.హెచ్.రమేష్, మందాల నాగేంద్ర, మహేశ్వర్ రెడ్డి, ఎంపీటీసీ ఎస్.ఏ. అబ్దుల్ రౌఫ్, అంజనేయులు, రామచంద్రయ్య, నాగేశ్వర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటిస్థలాలు ఇవ్వాలి

చిట్వేలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన పేదలకు ఇంటిస్థలాలు ఇవ్వాలంటూ సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, రైతు సంఘం నాయకులు తిప్పన ప్రసాద్, డీహెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దార్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ చిట్వేలి మండలంలోని నిరుపేదలకు ఇంటిస్థలాలు ఇవ్వాలని తహసీల్దారు మోహనకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కటారు శంకరయ్య, జి.జయరాం, పోలి దేవి, మద్దిన పుల్లయ్య, మద్దిన శ్రీనివాసులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ పనుల అడ్డగింతపై విచారణ



ప్లాంటును పరిశీలిస్తున్న సీఐ బాబు

సిద్దవటం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎంపీ నిధులతో జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్మిస్తున్న వాటర్ ప్యూరిఫయర్ ప్లాంట్ పనులను స్థానికులు అడ్డుకుంటున్నారంటూ కాంట్రాక్టర్ సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై సోమవారం ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్ ఫిర్యాదు మేరకు హెచ్‌ఎం శ్రీరాములు విచారణ చేసి కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ఎస్‌ఐ శివప్రసాద్, స్థానిక పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్‌సెంటర్ల ఏర్పాటు

పుల్లంపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈనెల 15 నుంచి 28 వరకు అంగన్వాడీ సెంటర్లలో ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో వరప్రసాద్ తెలిపారు. . 17వ తేదీన అనంతసముద్రం, పుల్లంపేట, 18న వత్తలూరు, దళవాయిపల్లె, 19న తిప్పాయపల్లె, పుత్తనవారిపల్లె, 20న అనంతయ్యగారిపల్లె, రెడ్డిపల్లె, 26న అనంతయ్యగారిపల్లె, రంగంపల్లె, 27న జాగువారిపల్లె, కొమ్మనవారిపల్లె, 28న దళవాయిపల్లె, అప్పయ్యరాజుపేట గ్రామాల్లోని అంగన్వాడీ సెంటర్లలో వీటిని నిర్వహిస్తున్నామన్నారు. డిజిటల్ అసిస్టెంట్‌లు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని ఎంపీడీవో ఆదేశించారు.

చిట్వేలి : మండలంలోని అంగన్వాడీ సెంటర్లలో ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు, 26 నుంచి 28వ తేదీ వరకు స్పెషల్ ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మోహన్ తెలియజేశారు..

కిశోర వికాసంపై శిక్షణ



కిశోర వికాసంపై శిక్షణ ఇస్తున్న సకళాదేవి


పుల్లంపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీవో సభాభవనంలో సోమవారం అంగన్వాడీ కార్యకర్తలకు ఏసీడీపీవో సకళాదేవి కిశోర వికాసంపై ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. తహసీల్దారు అరవింద కిషోర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నైపుణ్య, ఉపాధి, లింగవివక్ష, సంపూర్ణ ఆరోగ్యం, నాణ్యమైన విద్య, మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాలు అరికట్టుట, లైంగిక వేధింపుల నుంచి రక్షణ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు చక్రధర్‌రాజు, నాగతిరుమలరావు, ఏపీఓ శ్రీధర్ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : ఓబులవారిపల్లెలో ఎంపీడీవో మల్‌రెడ్డి మాట్లాడుతూ కిశోర బాలికల వికాసంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించే బాధ్యత మనందరి మీద ఉందని తెలిపారు.ఏసీడీపీవో సౌభాగ్యమ్మ, సరళాదేవి వ ముక్కావారిపల్లె ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ రూప , హెడ్మాస్టర్లు, ఏఎస్‌ఐ శ్రీనివాసులుతదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ఆరుద్ర నక్షత్ర పూజలు

చిట్వేలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆరుద్ర నక్షత్రం సందర్భంగా చిట్వేలిలోని శ్యామలాంబ, భువనేశ్వరి సమేత సోమే శ్వరాలయంలో సోమవారం అర్చకుడు పవన్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఉదయం 3 గంటలకు రుద్ర పఠన ం అనంతర పంచామృతాభిషేకం, సకల దర్వాభిషేకం, మంగళహారతి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయ విధానాన్ని పాటించాలి



ఘనజీవామృతం తయారీ విధానాన్ని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సంబేపల్లె, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ వ్యవసాయ విధానాలను అలవర్చుకోవాలని జెడ్‌బీఎన్ సభ్యులు శివయ్య, శ్రీదేవి తెలిపారు. సోమవారం మండలంలోని కట్టుగుత్తపల్లి, గుట్టపల్లి, శెట్టిపల్లి, నారా యణ రెడ్డిపల్లెల్లో సంఘ సభ్యులు నీమాస్త్రం, ఘనజీవామృతం, ద్రవజీవామృతాన్ని తయారు చేశారు. ఆఖరి దుక్కిలో రసాయనిక ఎరువులకు బదులు ఘనజీవామృతాన్ని ఒక ఎకరాకు 400 కేజీలు వేస్తే అధిక దిగుబడి వస్తుందన్నారు. నీమాస్త్రం పిచికారీతో చీడపురుగుల నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. రైతులు సేంద్రియ ఎరువులు వాడేలా అవగాహన కల్పి స్తున్నట్లు తెలిపారు. మానస, లక్ష్మి, నారాయణ, సుధాకర, హరిప్రసాద్, బాబుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌లో.. అభివృద్ధి ఏదీ..?


హార్సిలీహిల్స్ వ్యూ

- మొద్దునిద్ర వీడని టౌన్‌షిప్ కమిటీ
- ముందుకు సాగని ఒబెరాయ్ ప్రాజెక్టు
- ప్రతిపాదనలు దాటని రూ.కోట్ల పనులు
- పర్యాటకులకు రక్షణ కరువు

బి.కొత్తకోట, డిసెంబరు 16: ఆంధ్రా ఊటీగా పేరుగాంచిన ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ప్రస్తుతం అచేతనావస్థలో ఉంది. ఆహ్లాదకరమైన వాతావరణంతో సముద్ర మట్టానికి 4312 అడుగుల ఎత్తులో ఉన్న ఈ కొండ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. వైసీపీ హయాంలో ఇక్కడ పర్యాటకరంగ అభివృద్ధికి పైసా విదల్చకపోగా ఉన్న ఆస్తులనే ధారాదత్తం చేయాలని విఫలయత్నం చేశారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాకతో హార్సిలీహిల్స్‌కు ఇకపై మంచిరోజులు వస్తాయనే ఆశలు చిగురించాయి. మరుగునపడిన ఒబెరాయ్ ప్రాజెక్ట్ సీఎం చంద్రబాబు చొరవతో ముందుకు కదిలింది. హార్సిలీహిల్స్ అభివృద్ధికి గతంలో రూపొందించిన మాస్టర్‌ప్లాన్ ప్రకారం జాతీయస్థాయి పర్యాటక కేంద్రంగా గుర్తింపు కోసం చేపట్టదలచిన రూ.కోట్ల పనులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. హిల్స్ పాలక మండలిగా ఉన్న టౌన్‌షిప్ కమిటీ నిద్రావస్థలో ఉండడంతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. కూటమి ప్రభుత్వం దృష్టి పెడితే కొండకు పట్టిన గ్రహణం వీడి జాతీయస్థాయిలో పర్యాటకులను ఆకర్షించే కేంద్రంగా ఉంటుంది.

ముందుకు సాగని ఒబెరాయ్ పనులు

అంతర్జాతీయ గుర్తింపు పొందిన ఒబెరాయ్ సంస్థకు గతంలో టీడీపీ సర్కార్ హిల్స్‌పై 20.80 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఈ స్థలంలో హెలీప్యాడ్‌తో పాటు రూ.200 కోట్లతో ఫైవ్‌స్టార్ హోటల్ నిర్మించాల్సి ఉంది. అయితే వైసీపీ దీన్ని నీరుగార్చింది. కూటమి సర్కార్ అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు దీనిపై దృష్టి సారించారు. సీఎం ఆదేశాలతో కలెక్టర్ చామకూరి శ్రీధర్ చర్యలు చేపట్టారు. ఈ ఏడాది ఆగస్టు 27న ఒబెరాయ్ సంస్థ లీగల్ అఫైర్స్ ప్రెసిడెంట్ ఆర్.శంకర్, ప్రాజెక్ట్ కన్సల్టెంట్ నవీన్‌గోస్వామి, ఇంజనీర్ మయాంక్ తనేజలను రప్పించి, కొండ భోగోళిక స్థితి, విశిష్టతను, హోటల్ నెలకొల్పేందుకు అనువైన పరిస్థితులను వివరించారు. సంస్థకు కేటాయించిన 20.80 ఎకరాల స్థలాన్ని చూపించారు. ఒబెరాయ్ బృందం సంతృప్తి చెంది, బోర్డు మీటింగులో చర్చించి సెప్టెంబరులో నిర్మాణపనులు చేపడతామని చెప్పడంతో హోటల్ నిర్మాణానికి మార్గం సుగమమైనట్లేనని అందరూ భావించారు. అయితే ఏం జరిగిందో ఏమో అది కార్యరూపం దాల్చలేదు.


హిల్స్‌పై ఒబెరాయ్ సంస్థకు కేటాయించిన స్థలం

ప్రతిపాదనలు దాటని అభివృద్ధి ప్రాజెక్టులు

హిల్స్ అభివృద్ధి కోసం ప్రతిపాదించిన ఎన్నో ప్రాజెక్టులు పెండింగ్‌లోనే ఉండిపోయాయి. 2014లో రోప్‌వే ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఢిల్లీకి చెందిన బృందం సైతం పర్యటించి సర్వే చేసింది. హిల్స్‌పై నుంచి దిగువనున్న అమరనారాయణపురం వరకు విశాఖ తరహాలో రోప్‌వేను నిర్మించాలని భావించారు. అది ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంది. ఏపీ టూరిజం హరిత రిసార్టుల నిర్మాణానికి రూ.6.50 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అటవీశాఖ ప్రాంగణంలోని జూపార్కులో జంతువులు, పక్షులు తగినన్ని లేవు. అటవీ ప్రాంగణంలోని నాలుగెకరాల బండపై సాహసక్రీడల సముదాయం ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది.

ఘాట్‌రోడ్డులోని మలుపులలో రహదారిని విస్తరించడంతో పాటు రక్షణగోడను నిర్మించాలన్న ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. కొండపై అంత ర్జాతీయస్థాయి క్రీడాకారులను తయారు చేయాలన్న లక్ష్యంతో క్రీడా శిక్షణా కేంద్రం కోసం 3.74 ఎకరాల స్థలం కేటాయించి క్రీడల సముదాయ నిర్మాణం కోసం రూ.3.20 కోట్లు మంజూరు చేయగా, ప్రహరీ మాత్రం నిర్మించి, మిగతా పనులు పెండింగ్‌లో పెట్టారు. ఇందులో వైసీపీ ప్రభుత్వం యాత్ర-2 దర్శక నిర్మాత మహీ వి.రాఘవకు 2.00 ఎకరాలు కట్టబెట్టాలని చూసింది. ప్రస్తుతం జిల్లా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి క్రీడామంత్రిత్వ శాఖలో ఉన్నా, దీనిపై తగిన చర్యలు తీసుకోలేదు.

శాపంగా నీటిసమస్య... పారిశుధ్య లోపం

హార్సిలీహిల్స్‌లో నీటి సమస్య, పారిశుధ్య లోపం పర్యాటకుల పాలిట శాపంగా మారింది. హిల్స్‌పై బోర్లు వేసే అవకాశం లేనందున దిగువనున్న గాలేటివారిపల్లె వద్ద వేసిన బోర్ల నుంచి నీటిని 5 కి.మీ పైపులైన్ ద్వారా 7 దశల్లో పంపింగ్ చేసి కొండమీదకు తరలిస్తున్నారు. దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం కావడంతో తరచూ సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయి. ప్రస్తుత అవసరాలకు తగ్గ నీరు సరఫరా కావడం లేదు. కొండపై నీరు కొనాల్సి వస్తోంది. ఈ సమస్య పరిష్కారం కోసం హంద్రీ-నీవా కాలువ ద్వారా దిగువన ఓ చెరువును అనుసంధానం చేసి కొత్తపైపులైనుతో పంపింగ్ కోసం రూ.3 కోట్లతో ప్రతిపాదనలు ఉన్నా నిధులు రాక అమలుకు నోచుకోలేదు. వాటర్ గ్రిడ్ పరిధిలోకి హార్సిలీహిల్స్‌ను తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామన్న కలెక్టర్ మాటలు కార్యరూపం దాల్చాల్సి ఉంది. పారిశుధ్య లోపంతో పర్యాటకులు అసహ్యించుకునే పరిస్థితి నెలకొంది. ప్రధాన రోడ్డు, పర్యాటకులు సంచరించే గాలిబండ లాంటి ప్రదేశాలలో చెత్త చెదారం, మురికినీటి ప్రవాహం హిల్స్ ప్రతిష్ఠను దిగజారుస్తున్నాయి.

నోటీసులు ఎంత మేరకు ఫలిస్తాయో..

హిల్స్‌పై భూమి స్వాధీనంలో ఉంచుకున్న, నిర్మాణాలు చేపట్టిన వ్యక్తులు, సంస్థలకు బి.కొత్తకోట మండల రెవెన్యూ అధికారులు ఇటీవల నోటీసులు జారీ చేశారు. తమ స్వాధీనంలో ఉన్న స్థలానికి సంబంధించిన డాక్యుమెంటును చూపించాలని, లేదంటే స్థలాన్ని ఖాళీ చేయించి స్వాధీనం చేసుకుంటామని అంటున్నారు. ఇది ఏ మేరకు సాధ్యమవుతుందో, అధికారులు ఏం చేస్తారో చూడాల్సి ఉంది.



టౌన్‌షిప్ కమిటీ కార్యాలయం ఎదుట దుస్థితి

నిద్రావస్థలో టౌన్‌షిప్ కమిటీ..

హిల్స్‌కు పరిపాలన కేంద్రంగా ఉన్న టౌన్‌షిప్ కమిటీ నిద్రావస్థలో ఉందని పలువురు విమర్శిస్తున్నారు. హిల్స్‌పై పర్యాటక రంగ అభివృద్ధి, ఆస్తుల రక్షణ కోసం చొరవ చూపాల్సిన టౌన్‌షిప్ కమిటీకి సబ్‌కలెక్టర్ ఛైర్మన్‌గా ఉంటారు. ప్రతి మూడు నెలలకు సమావేశం నిర్వహించి అభివృద్ధి కార్యక్రమాలు, నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే సమావేశాలు లేకపోవడం, తగు చర్యలు తీసుకోకపోవడంతో అభివృద్ధి కుంటుపడింది. టోల్‌గేటు నిర్వహణతో ఈ ఏడాది రూ.46 లక్షలు వచ్చినా కొండపై కనీస సదుపాయాలు కల్పించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ కమిటీ ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు మరమ్మతులకు గురయ్యాయి. కొండపై అదనపు మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉంది. మరో వైపు కొండ పైనున్న 106 ఎకరాల భూమిలో బీఎస్ఎన్ఎల్, సీడీసీఎంఎస్, స్కౌట్ అండ్ గైడ్స్, సిరికల్చర్ తదితర శాఖలకు కేటాయించిన స్థలాలు ఇష్టారాజ్యంగా లీజులు ఇవ్వడం, చేపట్టిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పోలీస్ ఔట్‌పోస్టు ఉన్నా.. రక్షణ కరువు

హార్సిలీహిల్స్‌కు సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తారు. వీరికి రక్షణ లేకపోవడం కూడా హిల్స్‌కు ఓ లోపంగా మారింది. పర్యాటకుల రక్షణ కోసం అంటూ గత ముఖ్యమంత్రి జగన్ 2023 ఏప్రిల్ 14న హిల్స్‌పై పోలీస్ ఔట్‌పోస్ట్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. అప్పటి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సైతం హాజరయ్యారు. ఆ స్టేషన్‌లో నిత్యం పోలీసులు అందుబాటులో ఉంటూ పర్యాటకులకు రక్షణ కల్పిస్తారన్నారు. అది కార్యరూపం దాల్చలేదు. ఆ పోలీస్‌స్టేషన్ అలంకార ప్రాయంగా మారింది. ఫిర్యాదు వస్తే వెళ్లడం తప్ప ఔట్‌పోస్ట్‌లో సిబ్బంది లేకపోవడంతో, కుటుంబాలతో వచ్చే పర్యాటకులకు ఆకతాయి యువకులు, మందుబాబుల నుంచి రక్షణ కరువైంది. అల్లర్లు షరా మామూలుగా మారాయి. శాశ్వత ప్రాతిపదికన సిబ్బందిని నియమించి పర్యాటకులలో భరోసా కల్పించాల్సి ఉంది.



అలంకారప్రాయంగా మారిన హిల్స్ పోలీస్‌స్టేషన్

అధ్యాపకుల సంఘం అధ్యక్షుడిగా రాఘవరెడ్డి

మదనపల్లె టౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా మరిగి రాఘవరెడ్డిని ఎన్నుకున్నారు. ఆదివారం రాత్రి విజయవాడలో ఎస్ఆర్ఆర్, సీవీఆర్ కళాశాలల్లో నిర్వహించిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌సమావేశాల్లో మదనపల్లెకు చెందిన రాఘవరెడ్డి అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తోటి అధ్యాపకులు రాఘవరెడ్డిని అభినందించారు.

108 సిబ్బంది ఔదార్యం



కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కడప నగర పరిధిలోని అప్సర సర్కిల్ వద్ద గల విద్యుత్ కార్యాలయ గేటు వద్ద సోమవారం గుర్తు తెలియని మహిళ ప్రసవించింది. పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. కాగా ఆమెకు సహాయకులు ఎవరూ లేరు. ఈ విషయమై స్థానికులు 108 సిబ్బందికి తెలుపగా వారు తక్షణం స్పందించి తల్లీబిడ్డను క్షేమంగా కడప రిమ్స్‌లో చేర్పించారు. 108 సిబ్బంది అయిన సీఎం బాషా, అబ్దుల్ రజాక్‌లను స్థానికులు అభినందించారు.

119 చౌక ధర దుకాణాలకు రీ నోటిఫికేషన్

మదనపల్లె టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోని 119 చౌకధర దుకాణాల డీలర్ల నియామకానికి సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ రీనోటిఫికేషన్ విడుదల చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు డివిజన్‌లో తాత్కాలిక డీలర్లు వున్న 74 చౌకధర దుకాణాకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులో బి.కొత్త కోట మండలంలో 6, కలికిరిలో 10, కురబల కోటలో 5, మదనపల్లెలో 11, ములకలచెరువులో 3, నిమ్మనపల్లెలో 6, పెద్ద మండ్యంలో 2, పీటీఎంలో 3, రామ సముద్రంలో 3, తంబళ్లపల్లెలో 6, వాల్మీకిపురంలో 19 చౌక ధర దుకాణలతో పాటు, పునర్విభజన జరిగిన 45 చౌకధర దుకాణాలకు కొత్తగా డీలర్ల నియామకం చేపడుతున్నామన్నారు. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ బదులు కొత్త నోటిఫికేషన్ అమలులోకి వస్తుందన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 21 సాయంత్రం ఐదు గంటలలోపు ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 28వ తేదీ రాత పరీక్ష వుంటుందని, 30,31 తేదీల్లో ఇంటర్వ్యూలు వుంటాయని సబ్‌కలెక్టర్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

కురబలకోట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. దీనికి సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కనసానివారిపల్లె పంచాయతీ సిద్దారెడ్డిగారిపల్లెకు చెందిన సిబి.అశోక్‌కుమార్ (32) గత సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేశాడు. కాగా ఆ సమయంలో వైసీపీకి చెందిన పలువురు రకరకాలు బెదిరింపులకు పాల్పడంతో పాటుగా అతని భార్య చేత కేసు పెట్టించారు. అయినా ఏ మాత్రం అధైర్యపడకుండా ఎన్నికల్లో పోటీ చేశాడు. అనంతరం టీడీపీ రాజంపేట పార్లమెంటరీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా క్రియాశీలకంగా పని చేశాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రపోయాడు. ఉదయం ఎంతసేపటికి నిద్ర లేవకపోవడంతో అతని తల్లి వెళ్ళి నిద్రలేపగా మృతి చెందాడు. కాగా ఇతను ఒంటరితనం భరించలేక మృతి చెందాడా? లేక మరి ఏ ఇతర కారణంతో మృతి చెందాడో? తెలియడం లేదు. ఈ విషయం కుటుంబీకులకు తెలియడంతో అక్కడికి చేరుకుని బోరున విలపించారు.. కాగా పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ ఆసుపత్రికి వెళ్ళి మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

అక్రమ కట్టడాల కూల్చివేత ప్రారంభం

రాయచోటిటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాండవ్య నది ఒడ్డున బఫర్ జోన్‌లో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాల కూల్చివేత పనులను సోమవారం అధికారులు ప్రారంభించారు. గాలివీడు రోడ్డులోని బ్రిడ్జికి సమీపంలో అశోక్‌రెడ్డి అనే వ్యక్తి మాండవ్య నదిని ఆక్రమించడంతో పాటు బఫర్ జోన్‌లో నిర్మించిన భవనాలను మున్సిపల్ సిబ్బంది కూల్చివేశారు. కమిషనర్ వాసుబాబు పనులను పర్యవేక్షించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా కట్టడాలు నిర్మిస్తే కూల్చివేస్తామని ఈ సందర్భంగా కమిషనర్ హెచ్చరించారు.


మాండవ్యనది ఒడ్డున అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

అర్ధరాత్రి ఆకతాయిల వెకిలి చేష్టలు

- గురుకుల కళాశాల వద్ద ఘటన
- పోలీసుల దృష్టికి సమస్య

వాల్మీకిపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణ సమీపాన తరిగొండ రోడ్డులో గల ఏపీ మైనార్టీ బాలికల జూనియర్ కళాశాల వద్ద ఆదివారం రాత్రి ఆకతాయిలు చేసిన వెకిలి చేష్టలు విద్యార్థినులను భయభ్రాంతులకు గురి చేసింది. వివరాలిలా.. స్థానిక బాలికల మైనార్టీ జూనియర్ కళాశాలలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని ఆకతాయి యువకులు మద్యం మత్తులో కళాశాల పక్క భాగంలోని ప్రహరీ ప్రాంతం నుంచి గోడ దూకి లోపలికి చొరబడి.. విద్యార్థినులను అసభ్య పదజాలంతో వేధించారు. దీంతో భయభ్రాంతులకు గురైన బాలికలు బిగ్గరగా కేకలు పెట్టడంతో కళాశాల మహిళా సిబ్బంది అప్రమత్తమయ్యారు. గమనించిన ఆకతాయి యువకులు కళాశాల ప్రాంగణం నుంచి పరారయ్యారు. సోమవారం ఉదయం కళాశాలలో ఈ విషయం చర్చనీయాంశంగా మారడంతో దావానంలా వ్యాపించింది. కళాశాల ప్రిన్సిపాల్ రమామంజుల జరిగిన సంఘటనను స్థానిక పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా మైనార్టీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల ఒకే ప్రాంగణంలో ఉండటంతో విద్యార్థినుల తల్లిదండ్రులు కూడా భయాందోళనలకు గురవుతున్నారు. పాఠశాలలో కానీ, బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఎక్కడా కూడా సీసీ కెమెరాలు లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు విద్యార్థినుల భద్రత విషయంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ విషయమై ప్రిన్సిపాల్ రమామంజుల మాట్లాడుతూ ఎలాంటి చిన్న సంఘటన కూడా కళాశాల ప్రాంగణంలో చోటు చేసుకోలేదని, ఆదివారం జరిగిన ఘటనపై పోలీసులకు తెలియజేశామన్నారు. ప్రహరీ నిర్మాణం విషయం స్థానిక మండల పరిషత్ అధికారులకు విన్నవించామని, కళాశాల ప్రాంగణంలో సీసీ కెమెరాల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.


వాల్మీకిపురం మైనార్టీ గురుకుల పాఠశాల సమీపాన అసంపూర్తిగా ప్రహరీ నిర్మాణం



పోలీస్ స్టేషన్‌కు కేటాయించిన స్థలానికి ఫెన్సింగ్

కురబలకోట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు సమీపంలో పోలీస్ స్టేషన్‌కు కేటాయించిన స్థలం అన్యాక్రాంతానికి గురి కాకుండా పోలీసులు పటిష్టంగా ఫెన్సింగ్ వేశారు. మదనపల్లెలో రోడ్డులోని కుమ్మర ఫ్యాక్టరీ పక్కన సర్వేనంబర్ 363-1లో 96 సెంట్ల భూమి ఉంది. ఈ భూమిని అప్పట్లో టెర్రకోట కేంద్రానికి వారి నివాసాలకు రెవెన్యూ అధికారులు పట్టాలను మంజూరు చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి 2019లో 10సెంట్ల స్థలాన్ని మంజూరు చేసింది. అయితే అప్పటి నుంచి ఈ స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టలేదు. కాగా ఈ స్థలం పక్కనే కొంత జాగా ఖాళీగా ఉండటంతో అంగళ్ళుకు చెందిన డిష్ కుమారి గణపతి ఆలయంను మూడేళ్ల క్రితం నిర్మించింది. కాగా ఈ ఆలయానికి వెళ్లేందుకు మార్గ ముందు స్థలంలో రోడ్డు వేయడానికి ప్రయత్నించగా, అడ్డుకోవడానికి ప్రయత్నించిన హెడ్‌కానిస్టేబుల్ హరిపై దాడిచేశారనే అభియోగాలపై వైసీపీకి చెందిన సర్పంచ్ విశ్వనాథరెడ్డి, దామోదర్‌రెడ్డి, గుణకుంట వారిపల్లెకు చెందిన కృష్ణమూర్తి, శ్రీనివాసులు, శివరాంలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా రెవెన్యూ అధికారులు అక్కడికి ఆ స్థలానికి వెళ్లి సర్వే చేసి హద్దులు నిర్ణయించడంతో ఫెన్సింగ్ వేశారు.

పోలీస్‌స్టేషన్‌లో పందెంకోళ్లు..!



ఈ చిత్రంలో కనిపిస్తున్నవి మామూలు కోళ్లు కాదు.. కత్తికట్టి బరిలోకి దించే పందెం కోళ్లు. ఇవన్నీ బరిలో కాలు దువ్వకుండా ఇలా మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్‌లో సీఐ గది ఎదుట ఇలా తీరుతూ కనిపించాయి. కారణం పోలీసులు వీటిని పట్టుకోవడమే. మదనపల్లె మండలం, చీకలబైలు గ్రామం మేడిపల్లె సమీపంలో కోడిపందెం ఆడుతున్నట్టు పోలీసులుకు సమాచారం వచ్చింది. దీంతో సోమవారం ఆకస్మికంగా దాడి చేసి 17మందిని పందెంరాయుళ్లను అరెస్టు చేశారు. 12 కోళ్లను, రూ.21,900 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇలా స్వాధీనం తీసుకున్న పందెంకోళ్లను తీసుకొచ్చి స్టేషన్ పైభాగాన సీఐ గది ఎదుట కట్టేశారు.

- (మదనపల్లె అర్బన్-ఆంధ్రజ్యోతి)

ఈ ఇసుక డంపులు ఎవరివి?

- చెరువు చుట్టూ ఇసుక డంపులే
- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

గుర్రంకొండ, డిసెంబరు 16: గుర్రంకొండ మండలంలో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. ఇసుకాసురులు పగటి పూట చెరువులు, కుంటల్లో ఇసుకను తవ్వి ట్రాక్టర్లలో రైతుల పొలాల్లో డంపు చేస్తున్నారు. ఇలా పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ఇసుక డంపులుగా ఉంచుతున్నారు. ఈ ఇసుక డంపులను చీకటి పడగానే రాత్రి పూట ఎక్స్‌కవేటర్ల సాయంతో టిప్పర్లకు లోడ్ చేసి బయట రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఇసుక డంపుల గురించి అధికారులకు ఎవరైనా రైతులు సమాచారమిస్తే వారిపై ఇసుకాసురులు దాడులకు పాల్పడుతున్నట్లు వాపోతున్నారు. అంతేకాకుండా చెరువులో ఇసుక మీ సొంత ఆస్తి కాదుగా అంటూ వారిని దుర్భాషలాడుతున్నారు. గుర్రంకొండ మండలంలో ఇసుక వ్యాపారం మూడు టిప్పర్లు ఆరు ట్రాక్టర్లు అనే విధంగా సాగుతోంది.

గుర్రంకొండ మండలంలోని పలు చెరువులను ఇసుకాసురులు చెరపట్టారు. ఇందులో భాగంగా రామానాయునిచెరువు, హరిహరాదులచెరువులో ఇసుకను తవ్వి బయటకు తరలిస్తున్నారు. ఈ చెరువుల్లో పగటి పూట ఇసుకను తవ్వి చుట్టూ ఉన్న రైతుల పొలాల్లో డంపు చేస్తున్నారు. రామానాయునిచెరువు చుట్టూ ఉన్న రుద్రవారిపల్లె, ఇరగన్నగారిపల్లె, రేగడపల్లె గ్రామాల్లోని రైతుల పొలాల్లో అక్కడక్కడ పదిలోడ్ల ఇసుకను డంపు చేసి ఉంచారు. ఈ ఇసుక డంపులను రాత్రి పూట టిప్పర్‌లకు లోడ్ చేసి బయట ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. ఇసుక డంపుల గురించి పక్కపొలాల్లోని రైతులు అధికారులకు సమాచారమిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయంటూ వారిని ఇసుకాసురులు హెచ్చరిస్తున్నారు. దీంతో ఇసుక డంపుల గురించి చెప్పడానికి ప్రజలు, రైతులు ముందుకు రావడం లేదు.

ఇసుక డంపులుంటే సీజ్ చేస్తాం

అధికారుల అనుమతి లేకుండా ఇసుకను తరలించరాదు. ఇసుకను అక్రమంగా తరలించి నిల్వలు ఉంచరాదు. అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను గురించి సమాచారమిస్తే సీజ్ చేసి కేసు నమోదు చేస్తాం.

- మధురామచంద్రుడు, ఎస్ఐ, గుర్రంకొండ


రామానాయుని చెరువు సమీపంలోని పొలాల్లో డంపు చేసిన ఇసుక

అధికారులను కదిలించిన 'ఆటో గంగమ్మ'

చేయూతనిస్తామన్న ట్రైబల్ వెల్ఫేర్ కార్పొరేషన్



ఆటో గంగమ్మ వివరాలు తీసుకుంటున్న వెలుగు ఏపీఎం ఓబులేసు

కొండాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బతుకు భారమై.. ఆటో నడుపుతూ, ఆదర్శంగా నిలుస్తున్న ఆటో గంగమ్మ కథనం అధికారులను కదిలించింది. ట్రైబల్ వెల్ఫేర్ కార్పొరేషన్ నుంచి ఫోన్ చేసి ఆటో గంగమ్మ డేటా, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రుణం మంజూరు చేయించేందుకు సిద్ధమయ్యారు. వివరాల్లోకెళితే....

కొండాపురం మండలం గండ్లూరు ఎస్టీ కాలనీ వాసి గంగమ్మ కుటుంబం ఒక పూరి గుడిసెలో ఉంటోంది. గంగమ్మకు భర్త రవి, ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు, నలుగురు చెల్లెల్లు, ఒక తమ్ముడు, తల్లిదండ్రులు అరుణ, గంగన్న ఉన్నారు. వీరంతా గంగమ్మతోనే ఉంటున్నారు. భర్త రవి అనారోగ్యం కారణంగా ఇంట్లోనే ఉంటున్నాడు. గండికోట ముంపునకు గురైన గంగమ్మ ఇంటికి పరిహారం అందలేదు. ఆటో తెచ్చుకునేందుకు రుణం కావాలని, బ్యాంకుల చుట్టూ, అధికారులు చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా రుణం మంజూరు కాలేదు. బంధువుల నుంచి ఆటోను అద్దెకు తెచ్చుకుని ఆటో నడుపుతూ పెద్దకుటుంబాన్ని పోషిస్తోంది. దీంతో 'బతుకు భారమై.. ఆటో నడుపుతూ, ఆదర్శంగా నిలుస్తున్న ఆటో గంగమ్మ' శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ట్రైబల్ వెల్ఫేర్ కార్పొరేషన్ గంగమ్మ వివరాలను అడిగి తెలుసుకున్నారు. డీఆర్డీఏ జిల్లా అధికారుల ఆదేశాలతో వెలుగు ఏపీఎం ఓబులేసు సోమవారం సాయంత్రం గంగమ్మ ఇంటికి వచ్చి వివరాలు తీసుకున్నారు. గంగమ్మ డ్వాక్రా గ్రూపులో ఉన్నందున్న ఆమెకు రుణం ఇప్పించేందుకు తగిన వివరాలు తీసుకున్నట్లు ఏపీఎం తెలిపారు. తక్షణమే తనకు సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు గంగమ్మ తెలిపింది.

కబడ్డీ ఎంపికలకు అనూహ్య స్పందన



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ డిసెంబరు 16, (ఆంధ్రజ్యోతి): జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి కడప జిల్లా జూనియర్స్ బాల, బాలికల కబడ్డీ ఎంపికలకు ఔత్సాహిక క్రీడాకారుల నుంచి అనూహ్య స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి సుమారు వంద మంది క్రీడాకారులు హాజరయ్యారు. డీఎస్డీఓ జగన్నాథరెడ్డి, ఏపీ పీఈటీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ (అన్నమయ్య జిల్లా) వీరాంజనేయులు క్రీడకారులను పరిచయం చేసుకున్నారు. తదనంతరం పోటీలు నిర్వహించారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 22 నుంచి 25 వరకూ ఈస్ట్ గోదావరి జిల్లా రావులపాలెంలో జరుగనున్న అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొనాల్సివుంటుందని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకటసుబ్బన్న వెల్లడించారు. కార్యక్రమంలో డీఎస్ఏ కబడ్డీ కోచ్ ఆర్‌వీ శ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ జె. సుబ్బన్న, ట్రెజరర్ కొండయ్య డోనర్ పాల్గొన్నారు.

తైక్వాండోతో విద్యార్థినుల్లో మానసిక ధైర్యం : వీసీ



విద్యార్థినులకు సూచనలు చేస్తున్న వీసీ కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తైక్వాండో ఆత్మవిశ్వాసం పెంచి మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది, ధైర్యంగా ముందుకెళ్లగలిగేలా తయారుచేస్తుందని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం ఫిట్ ఇండియా వారోత్సవాల్లో భాగంగా వైవీయూ వసతి గృహాల విద్యార్థినులకు క్యాంపస్‌లో తైక్వాండో శిక్షణ తరగతులను పీజీ కళాశాల ప్రధానాచార్యులు, హాస్టల్ చీఫ్ వార్డన్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి, కులసచివులు ఆచార్య పి.పద్మ తో కలిసి ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ తైక్వాండో మానసిక క్రమశిక్షణ మాత్రమే కాక క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తుందన్నారు. భయం మనిషిని అచేతనంగా చేస్తుందని, ధైర్యం అనంత శక్తిని ఇస్తుందని ఉద్బోధించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, వసతి గృహ సంక్షేమ అధికారి డాక్టర్ సునీత, విద్యార్థినులు పాల్గొన్నారు.

10 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత - ఇద్దరు అరెస్ట్

రాజంపేట టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం కడప - చెన్నై హైవేలో మినీ లారీలో తీసుకెళుతున్న 10 టన్నుల రేషన్ బియ్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు మన్నూరు సీఐ మహ్మద్‌అలీ తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టాటా మినీ వాహనంలో చౌక బియ్యం అక్రమ రవాణా చేస్తుండగా పట్టుకున్నామన్నారు. తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణం మాసాపేట వాసి కంపా అంకయ్య, అనంతపురం జిల్లా గుంతకల్ పట్టణం బుచ్చిరెడ్డుకు చెందిన ఎరుకుల వెంకటరాఘవయ్య 150 బస్తాలతో 10 టన్నుల రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశామన్నారు. వాహనాన్ని, బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించామని సీఐ తెలిపారు.

పురాతన కత్తెరగండ్ల శివాలయం తొలగింపు



శిథిలావస్థకు చేరిన శివాలయం - యంత్రాలతో తవ్వి శిథిలాలను తొలగిస్తున్న దృశ్యం

కాశినాయన డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా శిథిలావస్థకు చేరిన చెన్నవరం సమీపంలోని అతిపురాతనమైన ఇష్టకామేశ్వరి దేవి సమేత సాంబశివస్వామి ఆలయాన్ని(కత్తెరగండ్ల శివాలయాన్ని) సోమవారం అధికారుల సమక్షంలో నిర్వాహకులు తొలగించారు. ఇందుకోసం 3 రోజులుగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సోమవారం పోలీసు, రెవెన్యూ అధికారుల సమక్షంలో శివాలయంలోని విగ్రహాలను బాలాలయంలోకి మార్చారు. అనంతరం గుడిని యంత్రాలతో తవ్వి శిథిలాలను తొలగించారు. ఈగుడిని పాండవుల మునిమనవడు జనమేజయ మహారాజు ప్రతిష్ఠించినట్లు స్థానికులు తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు

సిద్దవటం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): టక్కోలి అరుంధతివాడలో ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణలో నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలియజేశారు. ఏఎస్ఐ సుబ్బరామ చంద్ర మాట్లాడుతూ ఆదివారం రాత్రి అరుంధతీ వాడలో జేమ్స్ బాబు, వంశీబాబు, జయరాజ్ మల్లికార్జున అతని తల్లిదండ్రులపై దాడి చేశారు. మల్లికార్జునకు బలమైన గాయమవడంతో కడప రిమ్స్‌కు తరలించామన్నారు. బాధితుడి అన్న నేలటూరి ఈశ్వరయ్య ఫిర్యాదుపై నలుగురిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

మూగజీవాలకు స్వేచ్ఛ

పశువుల నిర్బంధంపై తహసీల్దారు ఆగ్రహం ● యానిమల్ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరిక
గదికి అడ్డంగా పాతిన బండలు తొలగింపు ● బయటకు తరలించిన అధికారులు



ఎద్దును బయటికి తీసుకొస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): దాయాదుల మధ్య తలెత్తిన పంతాలు, పట్టింపుల మధ్య నలిగి ఐదు రోజులు నిర్బంధంలో ఉన్న మూగజీవాలు స్వేచ్ఛావాయువులు పీల్చుకున్నాయి. ప్రొద్దుటూరు తహసీల్దారు గంగయ్య, ప్రొద్దుటూరు రూరల్ ఎస్ఐ మహ్మద్‌రఫి నంగనూరుపల్లెకు చేరుకుని నిర్బంధంలో ఉన్న జీవాలను విడుదల చేశారు. దీంతో పశువులు బయటికి వచ్చి స్వేచ్ఛా గాలులు పీల్చుకున్నాయి. వివరాల్లోకెళితే....

ప్రొద్దుటూరు మండలం నంగనూరుపల్లె వాసి మేకల చెన్నమ్మ కుటుంబం వ్యవసాయం చేసి జీవించేది. మూడేళ్ల కిందట చెన్నమ్మ భర్త గంగయ్య మృతిచెందడంతో అప్పటి నుంచి కుమారుడు వరుసయ్యే శ్రీనివాసుల వద్ద చెన్నమ్మ ఉండేది. కాగా శ్రీనివాసులు అతని సోదరులు వెంకటసుబ్బయ్య, నాగార్జున మధ్య ఆస్తి భాగపరిష్కార విషయం, రస్తా వివాదంలోనూ మనస్పర్థలుండేవి. దీంతో శ్రీనివాసులుకు చెందిన పశువులు ఉంచే గది ముందు బండలు నాటారు. దాయాదుల పంతాలు, పట్టింపుల ముందు మూగజీవాల ఆవేదన ఓడిపోయింది. పశువుల కన్నీటి రోధన కాఠిన్య హృదయాలను కదిలించలేకపోయింది. మూడు రోజులు తిండి, నీరు లేక చీకటి గదిలో గడిపాయి. ఈవిషయంపై ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రచురితమైన 'మూగజీవాల నిర్బంధం' శీర్షిక అధికారులను కదిలించింది. సోమవారం మధ్యాహ్నం తహసీల్దారు గంగయ్య, ఎస్ఐ మహమ్మద్‌రఫి ఇన్‌చార్జి వీఆర్వో హర్ష, ఇన్‌చార్జి సచివాలయ కార్యదర్శి చండీశ్వరి, సర్వేయర్ సయ్యద్ మహ్మద్‌యూసూఫ్, తమ సిబ్బందితో కలిసి నంగనూరుపల్లెకు చేరుకున్నారు. ఘటనా స్థలి ని పరిశీలించి మూగజీవాలపై పాల్పడిన దుశ్చర్యపై తహసీల్దారు ఆగ్రహిస్తూ పశువులను బంధించడం అమానుష చర్య అని హెచ్చరించారు. పాతిన బండలు తొలగించాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. రూరల్ ఎస్ఐ రఫి, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది, కలిసి బండలను తొలగించగానే పశువులు బయటికి వచ్చి స్వేచ్ఛాగాలులు పీల్చుకున్నాయి. తహసీల్దారు ఇరువర్గాలను ఉద్దేశించి మాట్లాడుతూ ఇలాంటి చర్యలు పునరావృతమైతే అనిమల్ క్రూయల్టీ యాక్టు 1960 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటూ క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఆడ, మగ అనే తేడా ఉండదని చట్టం దృష్టిలో అంతా సమానమేనని హెచ్చరించారు. వివాదాస్పద స్థలాన్ని సర్వేయర్‌చే కొలతలు వేయించగా ఆ జాగాలో 105 లింకుల కాల్వ పొరంబోకు స్థలం ఉందని తేల్చారు. ఈ జాగా ఎవరి సొత్తు కాదని నిర్ధారించారు. గ్రామంలో వివాదాలు, జీవాల నిర్బంధంపై దారితీసిన వైనాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లని రెవెన్యూ సిబ్బందిపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. నంగనూరుపల్లెలో రెగ్యులర్ వీఆర్వో, కార్యదర్శులు లేరని, ఇన్‌చార్జి సిబ్బంది తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లారు. రూరల్ ఎస్ఐ మాట్లాడుతూ 11వ తేదీన బండలు నాటిన సమయంలో చోటు చేసుకున్న సంఘటనలో మేకల శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి నిందితులైన నాగార్జున, వెంకటసుబ్బయ్య, వెంకటశివను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామని, ఈ కేసులో మరోముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని వివరించారు.



గదికి అడ్డంగా నాటిన బండలు - తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఫ్లైయాష్ మీద పడి....

● ఆర్టీపీపీ కాంట్రాక్టు కార్మికుడు మృతి
● పరిహారం కోరుతూ మెయిన్ గేటు వద్ద ధర్నా



మెయిన్ గేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆర్టీపీపీ కార్మిక సంఘం నేతలు (ఇన్‌సెట్‌లో) సందీప్ కుమార్ మృతదేహం

ఎర్రగుంట్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీలో 600 ప్లాంటు ఈఎస్పీ ఫ్లైయాష్ ఆపర్ వద్ద నాగార్జున కంపెనీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుడు పగిడికాల్వ సందీప్ కుమార్(28) మృతి చెందాడు. వివరాల్లోకెళితే... మూడు వారాలుగా ప్లాంటు షట్‌డౌన్ పనులు చేస్తున్నారు. ఈఎస్పీ వద్ద గడ్డకట్టిన ఫ్లైయాష్ తొలగింపులో కదిరివారిపల్లె వాసి సందీప్ పనిచేస్తున్నాడు. ఒక్కసారిగా ఫ్లైయాష్ అతనిపై పడడంతో అందులో కూరుకుపోయి ఊపిరాడక మృతి చెందాడు. తోటి కార్మికులు అతన్ని వెలికి తీసి ప్రాజెక్టు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు.

మృతిచెందిన కార్మికునికి పరిహారం విషయంలో కంపెనీ స్పందించకపోవడంతో కార్మిక సంఘాలు మృతదేహాన్ని ఫౌంటేన్ ప్రధానగేటు వద్ద ఉంచి ధర్నాకు దిగారు. సాయంత్రం వరకు చర్చలు జరిగాయి. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి, ఇతర కార్మిక సంఘనేతలు వారితో మాట్లాడారు. కంపెనీ నుంచి రూ.15లక్షలు నగదును ఇచ్చేందుకు ఒప్పించారు. కార్మికుని కుటుంబానికి జీఓ నెంబరు 129ప్రకారం ఆర్టీపీపీలో మెంటెనెన్స్‌లో ఉద్యోగం ఇచ్చేందుకు సీఈ కూడా అంగీకరించినట్లు కార్మిక వర్గాలు తెలిపాయి. దీంతో బాధితులు ధర్నా విరమించారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పరీక్ష నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇటీవల ఇలాంటి ప్రమాదాలు తరచూ జరగడంతో కాంట్రాక్టు కార్మికులకు భద్రత కరవైందని, యాజమాన్యాలు కనీస భద్రత కల్పించడం లేదని కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. ఇకపై ఇలాంటివి పునరావృతం కాకుండా కార్మికుల జీవితాలకు గట్టి భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

కార్యదర్శులపై డీఎల్‌పీఓ విచారణ

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గోపవరం పంచాయతీ పరిధిలో గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులు గురుమోహన్, రామమోహన్‌పై డీఎల్‌పీఓ తిమ్మక్క విచారణ చేపట్టారు. పంచాయతీ పరిధిలో అవినీతి జరిగిందని సమాచార హక్కు ద్వారా మార్తల వెంకటసుబ్బారెడ్డి జడ్పీసీఈఓకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం డీఎల్‌పీఓ గోపవరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించి అప్పట్లో విధులు నిర్వహించిన కార్యదర్శులు గురుమోహన్, రామమోహన్ సంజాయిషీ నమోదు చేసుకున్నారు. గతంలో వీరు లేఅవుట్ల విషయంలో బిల్డింగ్ అప్రూవల్, ఇంటి పన్నుల వసూళ్ల తదితర అంశాల్లో రెండు మూడేసి రశీదులు జారీ చేసి అవినీతికి పాల్పడ్డారని ఫిర్యాదుపై ఆమె విచారణ నిర్వహించారు. ఫిర్యాది వద్ద ఉన్న ఆధారాలు అందిస్తే నోటీసులు జారీ చేసి విచారణ జరుపుతామని డీఎల్‌పీఓ కోరగా త్వరలో అందజేస్తానని వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. కార్యదర్శుల సంజాయిషీ తీసుకుని జడ్పీసీఈఓకు నివేదిక పంపనున్నట్లు తిమ్మక్క వివరించారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో చిన్నకు స్వర్ణ పతకం



దువ్వూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో శని, ఆదివారాల్లో జరిగిన యోగివేమన యూనివర్శిటీ పరిధి పోటీల్లో డి.చిన్న స్వర్ణపతకం సాధించారు. ప్రొద్దుటూరు వాసి చిన్న పుల్లారెడ్డిపేటలోని డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్నారు. ఇతడు యూనివర్సిటీ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించారు. ఇదే విద్యార్థి బెస్ట్ ఫిజిక్ పోటీల్లో రెండో స్థానంలో నిలిచి వెండి పతకం గెలుపొందాడు. ఇదే కాలేజీకి చెందిన విద్యార్థులు కబడ్డీ పోటీల్లో 3వ స్థానంలో నిలిచారు. వీరికి సర్టిఫికెట్లు, మెమెంటోలను అందజేశారు. సోమవారం విజేతలను కాలేజీ కరస్పాండెంట్ ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, వ్యాయామ అధ్యాపకుడు కన్నయ్య అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



నాగయ్య మృతదేహం

రామాపురం, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలగిరి నాగయ్య (71) మృతి చెందగా గూడూరు బాషాకు తీవ్రగాయాలైనట్లు ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. రాయచోటి పట్టణం మాసాపేట వాసులు పాలగిరి నాగయ్య, గూడురు బాషా ఆదివారం కడపలో జరిగిన ఇష్తిమాకు వెళ్లి తిరిగి ఇంటికి మోపెడ్‌లో బయలుదేరారు. వీరి వాహనం కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై రామాపురం మండలం బండపల్లి పంచాయతీ పరిధి ఆటోనగర్ వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పాలగిరి నాగయ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివా రం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మధ్యవర్తిత్వమే పరిష్కార మార్గం

కడప రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం చక్కటి ప్రక్రియ అని మొదటి అదనపు జిల్లా జడ్జి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో సోమవారం మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు శిక్షణలో ఆయన మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడంతో పాటు ఖర్చు, సమయం ఆదా అవుతాయన్నారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో రాజీ మార్గమే రాజమార్గమన్నారు. ఖర్చు లేకుండా కక్షిదారులకు సత్వర న్యాయసేవలందించే లక్ష్యంతో సుప్రీంకోర్టు 1987లో న్యాయసేవాధికార సంస్థల చట్టాన్ని రూపొందించిందన్నారు. తద్వారా వ్యక్తుల మధ్య తగాదాలను రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తారన్నారు.

బాధితులకు న్యాయం చేయండి

కడప(క్రైం)డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం పోలీసు స్టేషన్‌కు వచ్చే వారి సమస్యలను తెలుసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఏఎస్పీ(పరిపాలన) ప్రకాష్‌బాబు సిబ్బందిని ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యలు అడిగితెలుసుకుని సంబంధిత పోలీసు స్టేషన్‌లకు బదిలీ చేశారు.

ఆరు ఎర్రచందనం దుంగల స్వాధీనం

రాజంపేట టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చెయ్యేరు నదీ ప్రాంతంలో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్న ఒకరిని సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీలు జి.బాలిరెడ్డి, వి.శ్రీనివాసరెడ్డి మార్గనిర్దేశకత్వంలో కడప సబ్ కంట్రోల్ సానిపాయ బేస్ ఆర్ఐ చిరంజీవులకు చెందిన ఆర్ఎస్ఐ వై.విశ్వనాథ్ టీమ్ ఆదివారం నుంచి జాండ్రపెంట ఎఫ్‌బీవోతో కలిసి గుర్రపుబాట తూర్పు వైపున గల చెయ్యేరువైపు కూంబింగ్ చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున వీరు మేకలకోన వద్దకు చేరుకోగా అక్కడ కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు. వీరు పోలీసులను చూసి పారిపోగా ఒకరిని పట్టుబడ్డారు. అక్కడున్న ఆరు దుంగలను స్వాధీనం చేసుకుని నిందితుడిని తిరుపతికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మైలవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు-తాడిపత్రి ప్రధాన రహదారిలో రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతున్న మద్దిరాల సుధాకర్ (48)ను వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందినట్లు తలమంచిపట్నం ఎస్ఐ లక్ష్మినారాయణ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు దన్నవాడ వాసులు సుధాకర్, కుమారుడు యేసుదాసు ఇద్దరూ ముందు వెనుకగా రోడ్డుకు ఓ పక్కన నడుచుకుంటూ వెళుతున్నారు. కాగా జమ్మలమడుగు నుంచి రామ్‌కో సిమెంటు పరిశ్రమకు వెళుతున్న లారీ వెనుక వైపు నుంచి సుధాకర్‌ను ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందగా లారీ మరికొంచెం ముందుకెళ్లి ద్విచక్ర వాహనాన్ని సైతం ఢీకొట్టి లారీ సహా డ్రైవర్ పరారీ అయ్యారు వెంటనే స్పందించిన పోలీసులు లారీని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుడు సుధాకర్ కూలి పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాల్వలో యూసీఐఎల్ ఉద్యోగి మృతదేహం



రామాంజనేయులు మృతదేహం

పులివెందుల టౌన్, డిసెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): యూరేనియంలో ఏఎండి ఆపరేటర్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి రామాంజనేయులు (28) మృతదేహం కాల్వలో లభ్యమైంది. ఆదివారం సాయంత్రం నల్లపురెడ్డి పల్లె దారిలో ఉన్న కాల్వ గట్టున బైక్ గమనించిన స్థానికులు అందించిన సమాచారంపై పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కాల్వలో గాలించారు. సోమవారం మృతదేహాన్ని బయటికి తీసి, ప్రభుత్వాస్పత్రికి తరలించి శవ పరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించామని పట్టణ సీఐ నరసింహులు తెలిపారు. మృతుని స్వగ్రామం వేముల మండలం, మబ్బు చింతలపల్లి కాగా ప్రస్తుతం ఎర్రగుడిపల్లెలో ఉంటున్నారు. మృతుడు ఆదివారం పూజలు చేయించుకుని పూజా సామగ్రిని కాల్వలో కలపడానికి వెళ్లి ప్రమాదవశాత్తు పడ్డాడని, ఈత రాక మునిగిపోయినట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందని సీఐ తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. వివరాలు పూర్తి విచారణ తర్వాత వెల్లడిస్తామన్నారు.

ఎమ్మెల్యే చొరవతో స్వగ్రామానికి కువైత్ బాధితురాలు

మదనపల్లె టౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా, టీడీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రాటకొండ మధుబాబు చొరవతో తాను స్వగ్రామానికి చేరుకున్నానని కువైత్ బాధితురాలు పార్వతమ్మ వివరించారు. సోమవారం మదనపల్లెలో ఎమ్మెల్యే నివాసానికి భర్త శంకర్‌నాయక్ తో కలిసి వచ్చిన ఆమె మాట్లాడుతూ తమది తంబళ్లపల్లె మండలం పెద్దమండ్యం మండలం వడ్డివంక తండా అన్నారు. కుటుంబం గడవక పోవడంతో రెండేళ్ల కిందట కువైత్‌లో పాచి పని చేసేందుకు అప్పు చేసి వెళ్లానని పార్వతమ్మ చెప్పింది. అక్కడ కువైత్ సేఠ్‌లు ఫిర్యాదుతో అక్కడి పోలీసులు తనను అరెస్టు చేసి తీవ్ర మానసిక క్షోభకు గురిచేశారన్నారు. ఈ విషయాన్ని తన భర్త శంకర్ నాయక్ మదనపల్లె ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయన కువైత్ ఎంబసి అధికా రులతో చర్చించారని, మధుబాబు కువైత్ అధికారితో ఫోన్‌లో మాట్లాడి తనను స్వదేశానికి వచ్చేలా చేశారన్నారు. పార్వతమ్మ, కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం చంద్రబాబును కలిసిన రామకృష్ణాచారి



సీఎంను కలసిన రామకృష్ణాచారి

మదనపల్లె టౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని టీడీపీ జాతీయ పార్టీ కార్యాలయంలో సీఎం చంద్రబాబును మదనపల్లెకు చెందిన బీసీ నేత మున్సిపల్ కౌన్సిలర్ తులసీ భర్త రామకృష్ణాచారి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మదనపల్లె నియోజకవర్గంలో ఎమ్మెల్యే షాజహాన్ బాషాతో కలసి చేపట్టిన సభ్యత్వ నమోదు, అభివృద్ధి కార్యక్రమాల గురించి రామకృష్ణాచారి సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆయనతో పాటు నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు శివరామ్‌ప్రతాప్ వున్నారు.

నిమ్మనపల్లి మండల సమస్యలపై మంత్రికి ఫిర్యాదు



సమస్యలను మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వివరిస్తున్న శ్రీరాంచినబాబు, టీడీపీ నాయకులు

నిమ్మనపల్లి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లి మండల సమస్యలపై రాయచోటి టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి సోమవారం టీడీపీ యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబు టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులకు గురై లేని పోని కేసులతో పోరాడారన్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సంబరపడ్డ కార్యకర్తలను గుర్తించేవారు లేరన్నారు. ఈ నెల 14న జరిగిన సాగునీటి ఎన్నికల్లో బాస్కర్‌రెడ్డికి మండల నాయకుల మద్దతు తెలియజేస్తే అందుకు విరుద్ధంగా మరో వ్యక్తిని పోటీకి దింపారని తెలిపారు. అనంతరం మండలంలోని కందూరు-మదనపల్లి రోడ్డు మంజూరు చేయాలని, గ్రామాలలో సీసీరోడ్లు, మురుగు నీటి కాలువలు నిర్మించాలని కోరారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సానుకూలంగా స్పదించి ప్రతి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటరమణ, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మన్న, సర్పంచ్‌లు మల్లప్ప నాయకులు చినబాబు, భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున, విజయ్, చెంద్రాయుడు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల భవనాలకు స్థల పరిశీలన



గుట్టపాలెం వద్ద గురుకుల పాఠశాల భూములను పరిశీలిస్తున్న అధికారులు

కలికిరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలకు శాశ్విత భవనాలను సమకూర్చేందుకు సోమవారం అధికారులు స్థలాన్ని పరిశీలించారు. గుట్టపాలెం గ్రామంలో కలికిరి-సోమల రహదారికి సమీపంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఈ భూమిలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసి పాఠశాలకు శాశ్విత భవనాలను ఏర్పాటు చేసేందుకు ఏపీ విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీడబ్ల్యూడీఐసీ) ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రవీంద్రబాబు ఈ స్థలంలో భవనాల ఏర్పాటుకున్న సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. డీపీఆర్‌ను (డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు)ను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సోమశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంగన్‌వాడీ కేంద్రాలలో ఆధార్ నమోదు

పెద్దమండ్యం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) పెద్దమండ్యం మండలం అంగన్‌వాడీ కేంద్రాలలో ఈ నె 17వ తేదీ (మంగళవారం) నుంచి 20వ తేదీ వరకు ఆధార్ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పెద్దమండ్యం ఎంపీడీవో శ్రీధర్‌రావు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ మంగళవారం వెలిగల్లు, బండ్రేవు అంగన్‌వాడీ కేంద్రాలలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాల్లో ఆధార్ నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే 18న బండమీదపల్లి, ముసలికుంట, 19న కలిచెర్ల పాతూరు, పెద్దమండ్యం 20న పాపేపల్లి, సిద్దవరం ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులకు ఆధార్ నమోదు ఉంటుందన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్న పిల్లలకు నూతనంగా ఆదార్ నమోదు కోసం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 4 రోజులు ప్రభుత్వం నిర్దేశించిన ఆయా కేంద్రాల్లో ఆదార్ ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ పేర్కొన్నారు. మండలంలోని నిర్దేశించిన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆదార్ ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తామని దీంతో ఆయా కేంద్రాల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లలకు ఆదార్ నమోదు చేయించాలన్నారు. ఈ ఆదార్ క్యాంపులు ఈనెల 20వ తేదీ వరకు ఏర్పాటు చేస్తామన్నారు. ఆయా కేంద్రాల్లో పని చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారులకు ఆధార్ నమోదు చేయించాలని సూచించారు.

అభివృద్ధిలో అధికారులదే కీలకపాత్ర



నిమ్మనపల్లె మండల అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లె మండల అభివృద్ధిలో అధికారులు కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. సోమవారం స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద ఎమ్మెల్యే కార్యాలయంలో నిమ్మనపల్లె మండలానికి చెందిన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లెపండుగ కార్యక్రమంలో మండలంలో సీసీరోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి పథకాల నిర్వహణ, ఓవర్ హెడ్ ట్యాంకుల క్లీనింగ్‌పై ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. ఇటీవల వర్షాలతో దెబ్బతిన్న వరిపంట వివరాలు నమోదు చేసి పంపాలని ఏవోను ఆదేశించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయడంలో ఎందుకు ఆలస్యమవుతోందని ఎస్పీడీసీఎల్ ఏఈని వివరణ అడిగారు. మండలంలోని ఆరు హైస్కూళ్లు, ఆరు ప్రాథమిక పాఠశాలల్లో 90 మంది విద్యార్థులు డ్రాపౌట్లుగా ఉన్నారని, వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవోను ఆదేశించారు. ప్రతి రోజు ఒక పాఠశాలను తనిఖీ చేసి అక్కడ మధ్యాహ్న భోజనం పథకం అమలు, విద్యాబోధన, సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. శాంతిభద్రతల సమస్య, కేసుల నమోదు తదితర విషయాలపై ఎస్ఐ తిప్పేస్వామిని వివరాలు అడిగితెలుసుకున్నారు.. ఈ సమావేశంలో పీఆర్ డీఈ శివశంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిథున్‌చక్రవర్తి, ఏవో మురళీమోహన్, ఎంఈవో పద్మావతి పాల్గొన్నారు.

టీడీపీలో కార్యకర్తలకు సముచిత స్థానం

రామసముద్రం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కోసం నిజాయితీగా పనిచేసిన కార్యకర్తలకు, విధేయులకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటూ సముచిత స్థానం కల్పిస్తుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా స్పష్టం చేశారు. రామసముద్రం మండలంలో గత రెండురోజుల క్రితం జరిగిన సాగునీటి సంఘ ఎన్నికలలో ఎన్నికైన చైర్మన్‌లు మండల టీడీపీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు సారధ్యంలో సోమవారం మదనపల్లెలో ఎమ్మెల్యేను కలిశారు. ఈసందర్భంగా చైర్మన్‌లను ఎమ్మెల్యే అభినందించి శాలువతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన వారికి చైర్మన్ పదవులు ఇచ్చి సముచిత స్థానం కల్పించామని తెలిపారు. అదేవిధంగా గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులు ఆయా గ్రామాలలోని పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఇచ్చి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి పార్టీ కృషి చేస్తోందని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘ చైర్మన్‌లు ఈశ్వర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరాజు, వెంకటాచలపతి, నాయకులు టేకుపల్లె రామమూర్తి, వెంకటేష్, వికాస్, కల్లు రమేష్, చినస్వామి, బద్రినాథ్, శివ, రమేష్, నడింపల్లె వాలెప్ప, మాజీ సర్పంచ్ రెడ్డిశేఖర్, వేణుగోపాల్, శీనప్ప, లోకనాథ్‌రాజు, సుధాకర్‌రెడ్డి, కృష్ణప్ప, శ్రీరాములు ఉన్నారు.

కాలనీకి దారిలేకుండా చేస్తున్నారంటూ నిరసన



సబ్‌కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న బంగారుకొత్తపేట గ్రామస్థులు

మదనపల్లె టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తమ కాలనీ ముందు ఉన్న డీకేటీ స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించి దారి లేకుండా చేస్తున్నాడని మదనపల్లె మండలం చిప్పిలి గ్రామానికి చెందిన ప్రజలు సబ్‌కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌కు వచ్చిన చిప్పిలి గ్రామం బంగారుకొత్తపేట కాలనీకి చెందిన ప్రజలు మాట్లాడుతూ తాము నిరుపేదలందరం కలిసి 15 ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నామన్నారు. తమ కాలనీకి వెళ్లే దారిలో జంగాల దేవేంద్ర అనే వ్యక్తి డీకేటీ స్థలాన్ని ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్నాడన్నారు. దీని వలన తమ కాలనీలోకి వెళ్లే దారిమూసుకుపోయిందన్నారు. ఏళ్ల తరబడి మదనపల్లె రెవెన్యూ అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని వాపోయారు. రెవెన్యూ అధికారులు విచారించి తమకు న్యాయం చేయాలని గ్రామస్థులు కోరారు.

టీడీపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన



అత్యధికంగా టీడీపీ సభ్యత్వాలు చేసిన ఫారుక్‌ను సన్మానిస్తున్న మండల టీడీపీ నేతలు

పెద్దమండ్యం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) టీడీపీ చేపట్టిన పార్టీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభించిదని టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, యువనేత సుమన్‌కుమార్ పేర్కొన్నారు. తంబళ్లపల్లి నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వాలు 50 వేలు దాటిన నేపథ్యంలో పెద్దమండ్యం లో టీడీపీ యువ నేత సుమన్‌కుమార్ ఆధ్వర్యంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు బాణసంచాలు పేల్చి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పెద్దమండ్యం మండలంలో అత్యధికంగా 950 మందికి టీడీపీ సభ్యత్వాలు చేసి గుర్తింపు పొందిన యువనాయకుడు ఫారుక్‌ను మండల టీడీపీ నేతలు సన్మానించి అభినందించారు. సోమవారం కూడా టీడీపీ సభ్యత్వం కార్యక్రమం జోరుగా జరిగింది. టీడీపీ నేతలు గంగాధర, కుంటకిందపల్లి చంద్రారెడ్డి, యుగంధర్‌రెడ్డి, గల్లా నారాయణ, మహేశ్వర, మహేంద్ర, ప్రభాకరరెడ్డి, చలపతి, రఘునాథరెడ్డి, జీవీ రమణ, నాగేశ్వరెడ్డి, నాగార్జున, సుబ్బయ్య తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళపై దాడి.. మనస్థాపంతో ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ

మదనపల్లె అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):మహిళపై అతని బావ దాడిచేయడంతో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం వేంపల్లెలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు మదనపల్లె మండలం, వేంపల్లెకు చెందిన వేణు భార్య కవిత(35) తన పొలంలో పండించిన వరిచేలును కొటారుకు వేసి విడిపించు సమయంలో తన బావ ఆనంద్ అడ్డుకుని కొట్టాడన్నారు. దీంతో తనకు ముగ్గురు ఆడపిల్లలు ఉండడం, మూడేళ్లక్రితమే తన భర్త వేణుమృతి చెందడంతో దిక్కులేని మహిళ మనుస్థాపం పురుగుల మందుతాగి ఆత్మహత్య కు యత్నించిందన్నారు. గమనించిన స్థానికులు చికిత్స కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలుకా పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): చిప్పిలిగ్రామంలోని మడికయ్యల శివాలయం, సీటీఎం రోడ్డులోని మంజునాథస్వామి ఆలయాల్లో సోమవారం భక్తులు పోటెత్తారు. స్వామివారి జన్మనక్షత్రం అయిన ఆరుద్ర నక్షత్రం పురష్కరించుకుని ఆలయాల్లో శివుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు విశ్వేశ్వరప్రసాద్, ఆలయకమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కామేశ్వరుడికి మార్గశిర ప్రత్యేక పూజలు

వాల్మీకిపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని కోనేటివీధిలో వెలసిన శివాలయంలో సోమవారం మార్గశిర మాసం సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, విశేష ద్రవ్యాలతో అభిషేకాలు, హోమాలు, ప్రత్యేక అలంకరణలు గావించారు. అనంతరం పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమాలలో ఆలయ ధర్మకర్త కువైట్ శంకరాచారి, అర్చకులు గోనవరపు శీనాస్వామి, భక్తులు పాల్గొన్నారు.

విజయవాడలో హైందవ శంఖారావం మహాసభ

మదనపల్లె అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):విజయవాడలో జనవరి 5వ తేదీన జరిగే హైందవ శంఖారా వం మహాసభను విజయవంతం చేయా లని ఆర్ఎస్ఎస్ రాష్ట్ర సహ ప్రభోదక్ ప్రభాకర్‌రాజు పిలుపునిచ్చారు. సోమ వారం స్థానిక సొసైటీకాలనీలోని రామా లయంలో సమావేశం ఏర్పాటు చేశా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హైందవ శంకారావం మహాసభను విజయవంతం చేయాడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. హిందూవులు అందరు ఐక్యత చాటాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భానుప్రకాష్, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ చౌకదుకాణాలకు దరఖాస్తులు

వాల్మీకిపురం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం మండలంలో ప్రభుత్వ చౌక దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించను న్నట్లు తహసీల్దార్ పామిలేటి పేర్కొన్నారు. వాల్మీకిపురం పట్టణంలో 1 నుంచి 9 చౌకదుకాణాలు, మండలంలోని చింతపర్తి గ్రామంలో రెండు, చారావాండ్లపల్లె, కూరపర్తి, అయ్యవారిపల్లె, కొత్తమంజూరు, గండబోయనపల్లె, యర్రావాండ్లపల్లె, బూడిదవేడు, గంగాదొడ్డి గ్రామాలల చౌక దుకాణాలకు ఆసక్తి కలిగిన అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.వివరాలకు రెవెన్యూకార్యాలయంలో సంప్రదించాలని తెలియజేశారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణోత్సవం

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పీటీఎంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా కమనీయంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు స్వామి వారికి అభిషేక పూజలు నిర్వహించారు. పీటీఎంకు చెందిన ఆధ్యాత్మిక వేత్త అయిన ననగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో శివుడికి ప్రీతికరమైన మార్గశిరమాసం ఆరుద్ర నక్షత్రంలో శివపార్వతుల కల్యాణ క్రతువును కర్ణాటక రాష్ట్రానికి చెందిన వేద పండితులైన వేణుగోపాల శర్మ, ఎంఎస్ శేషాచలం శర్మల చేతుల మీదుగా కన్నుల పండువగా నిర్వహించారు.. స్వామి వారి కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు పీటీఎంతో పాటు సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించి తరించారు. కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పీలేరులో ఘనంగా 'విజయ్ దివస్'



విజయ దివస్ గురించి విద్యార్థులకు తెలియజేస్తున్న ప్రిన్సిపాల్

పీలేరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మన దేశం 1971 యుద్ధంలో పాకిస్థాన్‌పై సాధించిన విజయానికి చిహ్నంగా ప్రతి ఏటా డిసెంబరు 16న జరుపుకునే విజయ దివస్‌ను సోమవారం పీలేరులోని సంజయ్ గాంధీ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళా శాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆనాటి యుద్ధంలో మన సాయుధ దళాలు చూపిన పోరాట పటిమను, ధైర్యసాహసాలు, చేసిన త్యాగాలు, అశువులు బాసిన సైనికులను స్మరించుకునేందుకు విజయ్ దివస్ జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఆనాటి సైనికులను స్ఫూర్తిగా తీసుకుని నేటి తరం వారు కూడా దేశభద్రత, నిర్మాణం, అభివృద్ధి కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ డాక్టర్ ఎం.వెంకటరమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలి



తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న శ్రీనివాసులు, తదితరులు

పీలేరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా విధిగా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పాలకుంట శ్రీనివాసులు కోరారు. మండల స్థాయిలో ప్రతి నెలా మండల స్థాయి సమావేశం నిర్వహించాలని జస్టిస్ పున్నయ్య కమిషన్ చెబుతున్నా గత ఆరు నెలలుగా పీలేరులో సమావేశం నిర్వహించకపోవడం శోచనీయమన్నారు. మండలంలో ఎస్సీ, ఎస్టీల సమస్యలు అపరిష్కృతంగానే మిగిలిపోతున్నాయని ఆయన వాపోయారు. ఈ మేరకు ఆయన తహసీల్దారు భీమేశ్వర రావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు తుమ్మల ధరణీ కుమార్, జెట్టి మల్లిఖార్జున, నగరిమడుగు సుభాష్ పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం

గుర్రంకొండ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి):రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలను పరిష్కరిస్తామని నోడల్ అధికారి లక్ష్మీపతి తెలిపారు. మండలంలోని నడిమికండ్రిగ గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో రైతులు తమ భూముల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా రైతుల నుంచి 16 అర్జీలు వచ్చినట్లు నోడల్ అధికారి లక్ష్మీపతి తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో వెంకటేశులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి డ్యాన్స్ పోటీలకు చిన్నారి ఎంపిక



నృత్యంలో ప్రశంసాపత్రం అందికొంటున్న చిన్నారి

మదనపల్లె అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి డ్యాన్స్ పోటీలకు మదనపల్లెలోని ప్రతిభ ఇంగ్లీషు మీడియం స్కూల్‌కు చెందిన జి.నందిని ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జయచంద్ర తెలిపారు. ఈ నెల 15న కదిరిలో ఆంధ్రప్రదేశ్ డ్యాన్స్ స్పోర్ట్స్ అసోసియే షన్, అనంతపురం డ్యాన్స్ స్పోర్ట్స్ అసోషియేషన్ సంయుక్తంగా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించగా విద్యార్థిని జి.నందిని జూనియర్ విభాగం కూచిపూడి నృత్యంలో ప్రథమ స్థానం సాధించిందన్నారు. కాగా ఈ నెల 28, 29 తేదీల్లో పంజాబ్ రాష్ట్రం, బటియానాలో నిర్వహించే జాతీయస్థాయి డ్యాన్స్ పోటీలకు అర్హత సాధించిన చిన్నారిని డ్యాన్స్ మాస్టర్ సూర్య, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రశంసాపత్రాన్ని అందించారు.

రేషన్ దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలంలో ఖాళీగా ఉన్న ఆరు రేషన్ దుకాణాలకు శాశ్విత ప్రాతిపదికన భర్తీ చేయుటకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దారు హరికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని తంబళ్లపల్లె (ఎస్సీ), వెంకటరెడ్డిగారిపల్లె(బీసీ-డి), రెడ్డివారిపల్లె(ఓసీ-మహిళ), తిమ్మయ్యగుండ్లు(బీసీ-బి), చెరువుముందరపల్లె(బీసీ-బి, మహిళ), గంగిరెడ్డిపల్లె(బీసీ-బి) ఖాళీలున్నట్లు తెలిపారు. ఇంటర్ పాసై 18 నుంచి 40 ఏళ్ల లోపు వయస్సు వారు స్థానికులు అర్హులన్నారు. అర్హులైన వారు ఈ నెల 21 సాయంత్రం 5 గంటల లోగా తంబళ్లపల్లె తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తును అందచేయాలన్నారు. 28వ తేదీ 10 గంటలకు రాత పరీక్ష ఉంటుందన్నారు. అర్హత మార్కులు సాధించిన వారికి 30, 31 తేదీలలో 1:15 నిష్పత్తిలో ఎంపిక చేయబడుతుందని పేర్కొన్నారు.

చిత్రం చెప్పిన సమస్య



కలకడ నడిబొడ్డున కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి పక్కనే 11 కేవీ విద్యుత్ స్తంభానికి తీగజాతికి చెందిన పొదలు అలుముకున్నాయి. దీంతో ఏమాత్రం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగినా ప్రమాదం ఎక్కువగా ఉంటుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏమరుపాటుగా తీగచెట్లను ఎవరైనా తగిలిన విద్యుత్‌షాక్ కొట్టే అవకాశం ఉందని వాపోతున్నారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి స్తంభం చుట్టూ ఉన్న ముళ్లపొదలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

-కలకడ, (ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించండి సార్!



పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పిడుగుపడి తన భార్య మృతి చెందిందని, పేదలైన తమకు ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించండి సార్! అంటూ మదనపల్లె మండలం పాళెంకొండకు చెందిన బాధితుడు కృష్ణమూర్తి సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు విన్నవించాడు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో సబ్‌కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ ఏడాది క్రితం పిడుగుపడి తన భార్య పద్మావతమ్మ మృతి చెందిన విషయమై పలుమార్లు అధికారులకు వినతి పత్రం ద్వారా విన్నవించినా ఇంత వరకు స్పందన లేదని వాపోయాడు. దీనిపై తనకు న్యాయం చేయాలని కోరాడు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం ఎస్పీడీసీఎల్‌కు తొమ్మిదినెలల క్రితం రూ.6లక్షలు చలానా చెల్లించినా విద్యుత్‌శాఖ అధికారులు తన బోరుకు ఇంత వరకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదని కొండామరిపల్లెకు చెందిన రైతు భాస్కర్‌రెడ్డి సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. తమ గ్రామంలోని సొంత ఇంటిలోకి వెళ్లనీయకుండా దాయాదులు తమను కొట్టి తరిమేస్తున్నారని కురబలకోట మండలం ముద్దవారిపల్లెకు చెందిన వృద్ధ దంపతులు రమణమ్మ, జయరామ్ సబ్‌కలెక్టర్‌ను ఆశ్రయించారు. వీటితో పాటు పాసుపుస్తకాలు మంజూరు చేయడం లేదని పలువురు సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ అర్జీలన్నింటిని క్షేత్రస్థాయిలో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

అభాగ్యుడికి కార్మిక సంఘ నాయకురాలు అండ



జీవాకు తినుబండారాలు అందజేస్తున్న జమీలా బేగం

పీలేరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎటువంటి ఆదరణ లేకుండా అనాథగా జీవిస్తున్న ఓ అభాగ్యుడిని ముంబైకు చెందిన కార్మిక సంఘ నాయకురాలు అండగా నిలిచిన సంఘటన సోమవారం పీలేరులో జరిగింది. పీలేరు పట్టణం మదనపల్లె టర్నింగ్ ప్రాంతానికి చెందిన జీవా(34) తొమ్మిది నెలల క్రితం ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో ఎడమ కాలు పోగొట్టుకోగా కుడి కాలుకు ఆపరేషన్ జరిగింది. తిరుపతిలోని రుయా ఆసుపత్రిలో చికిత్స అనంతరం అక్కడా ఇక్కడ ఉంటూ అద్దెలు చెల్లించలేక ప్లాస్టిక్ పట్టలతో చిన్న గుడిసె లాంటి ఆవాసం ఏర్పాటు చేసుకుని అందులో ఉండేవాడు. అతని దుస్థితి గమనించిన సామాజిక కార్యకర్త జానం గంగిరెడ్డి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి అతనికి సాయం చేయమని అభ్యర్థించాడు. ఆయన అభ్యర్థనను గమనించిన ముంబైకు చెందిన కార్మిక సంఘ నాయకురాలు డాక్టర్ జమీలా బేగం(ఈమె స్వస్థలం పీలేరు) ముంబై నుంచి ఆదివారం పీలేరుకు చేరుకుని జీవాకు సాయం చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. అందుకు అతని కుటుంబ సభ్యుల సహకారం అవసరమని సోమవారం పీలేరు తహసీల్దారు భీమేశ్వర రావు, అర్బన్ సీఐ యుగంధర్‌ను కోరగా వారు జీవా సోదరుడు మూర్తిని స్టేషన్‌కు పిలిపించి అతనికి అండగా నిలవాలని కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంట డాక్టర్ జమీలా బేగం జీవాను హుటాహుటిన తిరుపతి రుయా ఆసు పత్రికి తరలించారు. అతనికి చికిత్స, పునరావాసాన్ని తన బాధ్యతగా చూసుకుంటానని ఈసందర్భంగా ఆమె తెలియజేశారు. తమ వంతు సాయంగా అతనికి వికలాంగ పింఛను వచ్చేలా చర్యలు తీసుకుంటామని సీఐ, తహసీల్దారు తెలిపారు.

కందుకూరు సాగునీటి సంఘం ఎన్నికలపై ఫిర్యాదు



పీటీఎం ఎస్ఐ రవికుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పెద్దతిప్పసముద్రం మండలంలో ఈనెల 14న కందుకూరు వ్యాసరాయ సము ద్రం చెరువుకు జరిగిన సాగునీటి సంఘాల చైర్మన్ ఎన్నికల్లో పోలింగ్ అధికారులు కూటమి అభ్యర్థులైన టీడీపీ నాయకులకు ఏకపక్షంగా చేసి తమకు అన్యాయం చేశారంటూ సోమవారం బీజేపీ నాయకులు ఎస్ఐకి పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు మాట్లాడుతూ కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరోజు ఉదయం 9 గంటలకు తాము పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఎన్నికల్లో చైర్మన్‌గా పోటీ చేసేందుకు కావాల్సిన ధ్రువపత్రాలను తీసుకుని అభ్యర్థులతో చేరుకున్నామన్నారు. అయితే అక్కడ పనిచేస్తున్న ఎన్నికల అధికారులు తమ నామినేషన్‌ను తిరస్కరించి టీడీపీ నాయకులకు చైర్మన్ పదవిని కట్టబెట్టి ఏకపక్షంగా చేశారన్నారు. ఎన్నికల అధికారులు బీజేపీ నాయకులైన రాయల శ్రీనివాసులు వద్ద నుంచి నామినేషన్ రుసుము కింద రూ 1150, బుద్దా వెంకట్రమణ వద్ద నుంచి రూ. 200, పి. నారాయణమ్మ వద్ద నుంచి రూ. 1050, ఈశ్వరప్ప వద్ద నుంచి రూ.550, డబ్బులు కట్టించుకుని నామినేషన్ వేసిన తరువాత డబ్బులు కట్టిన రసీదులను తమ వద్ద ఉంచుకుని మా కార్యకర్తలను బయటకు పంపించి టీడీపీ నాయకులకు చైర్మన్ పదవిని అనుకూలంగా చేసి మాకు అన్యాయం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏకపక్షంగా వ్యవహరించిన అధికారులపై కేసునమోదు చేయాలంటూ ఎస్ఐకు పిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రంగారెడ్డి, వెంకటనారాయణ, బి.వెంకట్రమణ, రెడ్డెప్ప, పి.రమణ, శ్రీనివాసులు, రామప్ప, నారాయణమ్మ, వెంకట్రమణ, ఈరప్ప తదితరులు పాల్గొన్నారు

అధికారులు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులకు రెండు రోజులు శిక్షణ తరుగతులను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ పేర్కొ న్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన సచివాలయ ఉద్యోగులు, మం డల స్థాయి అధికారులు శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. జిల్లా అదికారుల ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, నిధులు, మౌలిక వసతుల కల్పనకు చేపట్టే విధి విదానాలను రూపకల్పన ప్రణాళికల కోసం ఈ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. మండలంలోని సచివాలయ ఉద్యోగులు, గ్రామ స్థాయి, మండల స్థాయి అదికారులను రెండు విభాగాలుగా విభజించి రెండు రోజులు వారికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజు మండల స్థాయి అధికారులు, సర్పం చ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, విద్యాశాఖ సహాయ కులు, విలేజ్ రెవెన్యూ అధికారులు, అగ్రి, సిరికల్చర్ అసిస్టెంట్లు పాల్గొంటార న్నారు. రెండో రోజు సర్వే అసిసెంట్లు, ఎనర్జీ అసిసెంట్లు వెటర్నరీ అసిసెంట్లు, డిజిటల్ అసిసెంట్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్ఎం గ్రేడ్-3 లు పాల్గొంటారన్నారు.